తెలంగాణ TELANGANA MUCHATLU

ముచ్చట్లు

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | సోమవారం-19-జనవరి 2026 | సంపుటి : 3 | సంచిక : 231 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


# ఎన్టీఆర్, వైయస్సార్ స్ఫూర్తితో పేదలకు సంక్షేమ కార్యక్రమాలు

- ఎన్టీఆర్, వైఎస్సార్ ఆశయాలతో సంక్షేమ పాలన
- ఖమ్మం జిల్లాలో ప్రజాప్రతినిధులతో సీఎం సమీక్ష
- ఉచిత సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డుల పంపిణీ
- రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అమలు
- ఇందిరమ్మ ఇండ్లతో పేదలకు భరోసా
- మున్నేరు–పాలేరు లింక్ కెనాల్‌కు శంకుస్థాపన
- సీతారామ ఎత్తిపోతల పథకానికి వేగం
- ఖమ్మం జిల్లాకు ఇరిగేషన్, విద్య, వైద్య అభివృద్ధి
- పరిశ్రమల పార్కు మంజూరుకు డిప్యూటీ సీఎం విజ్ఞప్తి



**ఖమ్మం బ్యూరో,జనవరి 18 (తెలంగాణ ముచ్చట్లు)**

ఎన్టీఆర్, వైయస్సార్ స్ఫూర్తితో పేదలకు సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్రంలో అమలు చేస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇంచార్జి మంత్రి వర్యులు వాకాటి శ్రీహరి, నీటిపారుదల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ హౌసింగ్ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావులతో కలిసి పర్యటించి మద్దులపల్లిలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజా ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం జిల్లా ప్రజలు తనకు ఎల్లప్పుడూ అండగా ఉన్నారని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఎన్టీఆర్, వైఎస్సార్ పేర్లు శాశ్వతంగా నిలిచి పోతాయని తెలిపారు.

మిగతా 2లో



# మేడారం మహాజాతర ఏర్పాట్లపై ముఖ్యమంత్రి సమీక్ష

- జంపన్న వాగు వరకు బస్సులో ప్రయాణించి పరిశీలన
- ఏఐ, డ్రోన్, సీసీ కెమెరాలతో భద్రతా పర్యవేక్షణ
- గద్దెల పునరుద్ధరణ పనులపై ప్రత్యేక దృష్టి

**మేడారం, జనవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):**

అతిపెద్ద ఆదివాసీ పండుగగా గుర్తింపు పొందిన మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర కోసం చేపట్టిన ఏర్పాట్లను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్వయంగా సమీక్షించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రివర్గ సహచరులతో కలిసి బస్సులో జంపన్న వాగు సర్కిల్ వరకు ప్రయాణించి, జాతరకు వచ్చే లక్షలాది భక్తుల కోసం చేసిన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

మహాజాతరకు సంబంధించి పోలీస్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను ముఖ్యమంత్రి పర్యవేక్షించారు. సీసీ కెమెరాల అనుసంధానం, డ్రోన్ కెమెరాల వినియోగం, ఆధునిక పర్యవేక్షణ వ్యవస్థల అమలుపై పోలీసు ఉన్నతాధికారులు వివరించారు. ఏఐ సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా సీసీ కెమెరాల పనితీరు, గుంపుల నియంత్రణ, భద్రతా చర్యలపై సమగ్ర వివరణ ఇచ్చారు.

మిగతా 2లో

# రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై హరీష్ రావు తీవ్ర విమర్శలు

- నేర చర్యలకు ముఖ్యమంత్రి బహిరంగ పిలుపు
- శాంతిభద్రతలను దెబ్బతీసే ప్రయత్నం
- డీజీపీ మౌనంపై ప్రశ్నలు

**హైదరాబాద్, జనవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ జెండా దిమ్మెలను కూల్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగంగా పిలుపునిచ్చిన వ్యాఖ్యలు రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపుతున్నాయి. ముఖ్యమంత్రి, హోంమంత్రి హోదాలో ఉన్న వ్యక్తే శాంతిభద్రతలకు భంగం కలిగించేలా మాట్లాడటం అత్యంత ప్రమాదకరమని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు.

ఈ వ్యవహారంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్రస్థాయిలో స్పందించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత ఉన్న ముఖ్యమంత్రి

మిగతా 2లో



# హుస్నాబాద్‌లో ఘనంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు

- లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ
- మహిళలకు వడ్డీలేని రుణాలు, చీరల పంపిణీ
- అభివృద్ధి–సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**హుస్నాబాద్, జనవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):**

హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం స్వర్ణకారుల సంఘం భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు.

హుస్నాబాద్ మున్సిపాలిటీకి చెందిన 8, 9, 17, 18, 19 వార్డుల్లోని లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. అదే సమయంలో మహిళల ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా 3520 మంది మహిళలకు కోటి 13 లక్షల రూపాయల విలువైన వడ్డీలేని రుణాల చెక్కులను మంత్రి అందజేశారు. ఈ పథకం మహిళల జీవితాల్లో భద్రత, ఆర్థిక స్థిరత్వం తీసుకురావడంలో కీలకంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

ఇందిరమ్మ సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా 18 ఏళ్లు పైబడిన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయడం జరిగింది. మహిళల గౌరవం, సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. పేదల ఇంటి కలను నిజం చేయడమే కాకుండా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ఈ పథకాల ఉద్దేశమన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమవతి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డితో పాటు ఇతర ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేసేందుకు అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు.

# బిహార్ అభివృద్ధి సదస్సులో పాల్గొన్న ఎంపీ ఈటెల రాజేందర్

- దేశ అభివృద్ధిలో బిహార్ ప్రజల పాత్ర కీలకం
- కరోనా కాలంలో వలస కార్మికుల సేవలు మరవలేనివి
- అభివృద్ధి చెందిన భారత్‌కు అభివృద్ధి చెందిన బిహార్ అవసరం



**హైదరాబాద్, జనవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్‌లోని టి హబ్‌లో నిర్వహించిన బిహార్ అభివృద్ధి సదస్సు - ౨౦౨౬ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనడం గౌరవంగా ఉందని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ తెలిపారు. వ్యవసాయం, పాడి పరిశ్రమ, కోళ్ల పెంపకం, మౌలిక వసతుల రంగాల వరకు దేశ వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనుల్లో బిహార్ ప్రజల శ్రమ కీలకమని ఆయన పేర్కొన్నారు.

కరోనా మహమ్మారి సమయంలో తాను ఆరోగ్య మంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్ అభివృద్ధిలో బిహారీ సమాజం చేసిన సేవలను ప్రత్యక్షంగా చూశానని ఈటెల రాజేందర్ గుర్తు చేశారు. లాక్‌డౌన్ సమయంలో స్వగ్రామాలకు చేరుకునేందుకు వలస కార్మికులు పడిన కష్టాలు తనను తీవ్రంగా కదిలించాయని, వారి సురక్షిత ప్రయాణం కోసం ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేశామని తెలిపారు.

మిగతా 2లో

# గ్రేటర్ హైదరాబాద్ ట్రాఫిక్ సమస్యలపై ప్రభుత్వం ఫోకస్


- యువ ఐపీఎస్ అధికారులకు కీలక బాధ్యతలు
- దీర్ఘకాలిక పరిష్కారాలే లక్ష్యం
- శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణకు ప్రాధాన్యం

**హైదరాబాద్, జనవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, శాంతిభద్రతల బలోపేతంపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. నగరవాసులు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో కీలక విభాగాల్లో పలువురు యువ, డైనమిక్ ఐపీఎస్ అధికారులను నియమించింది.

ఈ బదిలీలపై తెలంగాణ డీజీపీ బి. శివధర్ రెడ్డి ఆదివారం స్పందించారు. నగర పాలనను మెరుగుపరచడం ప్రభుత్వ ప్రాధాన్యతలలో ముఖ్యమని, అందులో భాగంగానే నగర ట్రాఫిక్ సమస్యలకు దీర్ఘకాలిక, స్థిరమైన పరిష్కారాలు

మిగతా 2లో



# ఎన్టీఆర్, వైయస్సార్ స్ఫూర్తితో పేదలకు సంక్షేమ కార్యక్రమాలు



(మొదటి పేజీ తరువాయి)

గతంలో తెలుగు వారు అంటే మద్రాసీలు అనే పేరు ఉండేదని, తెలుగువారి ఆత్మ గౌరవానికి ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప నాయకులు ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఈ వేదిక నుంచి వారికి నివాళులు అర్పిస్తున్నామని అన్నారు.

పేదలు కడుపు నిండా అన్నం తినాలని ఉద్దేశ్యంతో ఆ రోజులలో రెండు రూపాయలకు కిలో బియ్యం పథకాన్ని ప్రవేశ పెట్టారని, మన రాష్ట్ర ప్రభుత్వం నేడు మూడు కోట్ల 17 లక్షల మంది లబ్ధిదారులకు నెలకు 6 కిలోల చొప్పున సన్న బియ్యం ఉచితంగా సరఫరా చేస్తూ పేదల ఆకలి తీరుస్తున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో అర్హులైన నిరుపేదలందరికీ నూతన రేషన్ కార్డులు జారీ చేశామని, ఇంకా ఎవరైనా రేషన్ కార్డు లేని అర్హులు ఉంటే వెంటనే మంజూరు చేస్తామని అన్నారు.

ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రైతులకు ఉచిత కరెంటుపై మొదటి సంతకం చేయడమే కాకుండా 1300 కోట్ల విద్యుత్ బకాయిలు రద్దుచేసి, వేలాది మంది రైతులపై ఉన్న కేసులను తొలగించిన మహానుభావుడు వైఎస్ఆర్ అని అన్నారు. ఆయన స్ఫూర్తితో నేడు 24 గంటల పాటు రైతులకు ఉచిత విద్యుత్ అందించడంతో పాటు పేదలకు నెలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ 52 లక్షల పేదల కుటుంబాలకు, 30 లక్షల పంపు సెట్ లకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు ఉండాలని గతంలో వైయస్సార్ 25 లక్షల ఇండ్లు నిర్మిస్తే, గత పాలకులు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరిట మోసం చేశారని సీఎం విమర్శించారు.

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి భద్రాచలంలో శ్రీరామ చంద్రమూర్తి సాక్షిగా ప్రవేశ పెట్టామని అన్నారు. ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కూడా ఖమ్మం జిల్లాలో ప్రారంభించామని అన్నారు. ఏప్రిల్ నెల తర్వాత పట్టణ ప్రాంతాలలో ఉన్న పేదలకు రెండవ విడత ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసే బాధ్యత తీసుకుంటామని అన్నారు.

◆ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఇరిగేషన్, ఎడ్యుకేషన్, హెల్త్ రంగాలకు సంబంధించి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అవసరమైన అన్ని పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో చేపట్టామని అన్నారు. ఇరిగేషన్ కు సంబంధించిన మున్నేరు పాలేరు లింకు, ఎడ్యుకేషన్ సంబంధించి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల శంకుస్థాపన, నర్సింగ్ కళాశాల ప్రారంభోత్సవం, హెల్త్ కు సంబంధించి కూసుమంచిలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని అన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి లభించే విధంగా అవసరమైన పరిశ్రమలను కూడా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు తీసుకొని రావలసిన అవసరం ఉందని అన్నారు. జిల్లాకు పరిశ్రమల పార్కు ప్రత్యేకంగా మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని డిప్యూటీ సీఎం కోరారు.

◆ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం 50 నుంచి 60 టీఎంసీల మున్నేరు నది జలాలు వృధాగా బంగాళాఖాతంలో కలుస్తున్నాయని, ముల్కనూర్ గ్రామం వద్ద చెక్ డ్యాం నుంచి 9.6 కిలో మీటర్ల గ్రావిటీ కాల్వ ద్వారా మున్నేరు పాలేరు లింక్ కేనాల్ పనులకు ప్రభుత్వం 162 కోట్లతో చేపట్టామని, ఈ ప్రాజెక్టు ద్వారా 2 మెగా వాట్ల హైడల్ విద్యుత్ ఉత్పత్తి, లక్షా 50 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని అన్నారు.

గత పాలకుల పాలనలో సీతారామ ఎత్తిపోతల పథకం డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణానికి ఒక ఎకరం కూడా భూ సేకరణ చేయలేదని విమర్శించారు. గోదావరి నది జలాల ద్వారా ఖమ్మం జిల్లాలో ఆరు లక్షల 80 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు పనులు వేగవంతం చేశామని అన్నారు. 4వ పంప్ హౌస్ పనులు వేగవంతం అవుతున్నాయని అన్నారు.

ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత సీతారామ ఎత్తిపోతల పథకానికి 67 టిఎంసిల నీటి కేటాయింపు చేయడం జరిగిందని అన్నారు. మున్నేరు పాలేరు నది లింక్ కేనాల్ ద్వారా ప్రతి సంవత్సరం దాదాపు 120 కోట్ల విద్యుత్ ఆదా అవుతుందని అన్నారు. మున్నేరు పాలేరు లింక్ కాల్వ పనులు సంవత్సరంలోగా పూర్తి చేసి ప్రారంభిస్తామని అన్నారు.


◆ జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు వాకాటి శ్రీహరి మాట్లాడుతూ అతి తక్కువఖర్చుతో లక్ష యాభై వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ కోసం మున్నేరు పాలేరు లింకు పనులను ప్రజా ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. పేద ప్రజల కోసం ప్రజా ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు పంచాయతీ ఎన్నికలలో ఆమోదం తెలిపిన విధంగానే రాబోయే మున్సిపల్ ఎన్నికలలో కూడా ఆశీర్వదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

◆ వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ గోదావరి జలాలను ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న 10 అసెంబ్లీ నియోజకవర్గాలకు తరలించాలనేదే తన లక్ష్యమని చెప్పారు. సీతారామ ఎత్తిపోత్తల పథకం సవరించిన అంచనాలకు ప్రభుత్వం ఇటీవల ఆమోదం తెలిపిందని, కాల్వల నిర్మాణానికి భూ సేకరణ చేస్తున్నామని, భవిష్యత్తులో కృష్ణ జలాలు ఇబ్బందులు ఉన్నప్పటికీ నాగార్జున సాగర్ 3 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ కోసం గోదావరి జలాలను వినియోగిస్తామని అన్నారు. మంచినీటికి, సాగునీటికి ఇబ్బందులు పడుతూ కరువుతో తల్లాడిన పాలేరు నియోజకవర్గంలో భక్త రామదాసు ప్రాజెక్టు పూర్తి చేసి పసిడి పంటలు, పామాయిల్ హబ్ గా తీర్చిదిద్దామని అన్నారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో రైతులు వాణిజ్య పంటలు పండించి ఆర్థికంగా బలోపేతం అయ్యే విధంగా చర్యలు చేపట్టామని అన్నారు. అన్ని గిరిజన తండాలకు రహదారులు వేసే అవకాశం, నాలుగు మండలాలకు జాతీయ రహదారులు తీసుకొచ్చే అవకాశం తనకు కలిగిందని తెలిపారు.

◆ రెవెన్యూ హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ బంగాళాఖాతంలో వృథాగా కలిసే మున్నేరు నది జలాలను 9.6 కిలో మీటర్ల మేర త్రవ్వి గ్రావిటీ కెనాల్ ద్వారా పాలేరు రిజర్వాయర్ లో కలిపేందుకు 162 కోట్లతో చేపట్టిన మున్నేరు పాలేరు లింక్ కెనాల్ పనులకు నేడు శంకుస్థాపన చేసుకోవడం సంతోషంగా ఉందని, దీని ద్వారా నాగార్జున సాగర్ క్రింద ఉన్న లక్షా 50 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని అన్నారు. గ్రామ పంచాయతీ ఫలితాలు అద్భుతంగా వచ్చాయని, అదే విధంగా ఖమ్మం జిల్లాలోని మున్సిపాలిటీలు, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కు జరగబోయే ఎన్నికలలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎంపీ లు రామసహాయం రఘురాం రెడ్డి, మల్లు రవి, ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్టా రాగమయి, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, మువ్వా విజయ్ బాబు, నాయుడు సత్యనారాయణ, ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.





# మేడారం మహాజాతర ఏర్పాట్లపై ముఖ్యమంత్రి సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)



దాదాపు వెయ్యేళ్ల వీరగాథ, ఆదివాసీ జాతి వారసత్వ సంపదకు అద్దం పట్టేలా చేపట్టిన మేడారం వనదేవతల గద్దెల ప్రాంగణ పునరుద్ధరణ పనులను ముఖ్యమంత్రి పరిశీలించారు. రాతి ప్రాకారాలు, శిలాతోరణాలతో సంప్రదాయ వైభవం ఉట్టిపడేలా చేపట్టిన అభివృద్ధి పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మహాజాతర ఆధ్యాత్మికతకు, చరిత్రకు భంగం కలగకుండా అభివృద్ధి జరగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

మూలవాసులైన కోయ తెగల ఆచారాలు, సంప్రదాయాలు ప్రతిబింబించేలా రూపుదిద్దుకున్న ప్రాంగణాన్ని ముఖ్యమంత్రి ఆసాంతం పరిశీలించారు. సుమారు 250 కోట్ల రూపాయల వ్యయంతో గత కొంతకాలంగా శరవేగంగా సాగిన పనులను ఒక్కొక్కటిగా పరిశీలిస్తూ, జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పక్కాగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మేడారం మహాజాతరను ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందేలా నిర్వహించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా తెలిపారు.

# బిహార్ అభివృద్ధి సదస్సులో పాల్గొన్న ఎంపీ ఈటెల రాజేందర్

(మొదటి పేజీ తరువాయి)

కరోనా అనంతరం వారి నైపుణ్యాలకు భారీగా డిమాండ్ పెరిగిందని, బియ్యం మిల్లులు, నూనె మిల్లులు, నిర్మాణ రంగ సంస్థలు తిరిగి బిహారీ కార్మికులను పంపించాలని ప్రభుత్వాన్ని కోరిన విషయాన్ని ఆయన వివరించారు. ఇది బిహార్ ప్రజల క్రమశిక్షణ, కృషి, నిబద్ధతకు నిదర్శనమని అన్నారు.

"రాష్ట్రాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది" అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పిన మాటలను ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ గుర్తు చేశారు. అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యాన్ని సాధించాలంటే అభివృద్ధి చెందిన బిహార్ అవసరమని స్పష్టం చేశారు. మోదీ నాయకత్వంలో దేశంలో దేశభక్తి భావన మరింత బలపడిందని, విభిన్న నేపథ్యాలున్నా భారతీయులంతా ఏకమవుతున్నారని అన్నారు. తన నియోజకవర్గమైన మల్కాజిగిరి భారత దేశ ఆత్మను ప్రతిబింబిస్తుందని, ప్రతి రాష్ట్రానికి చెందిన ప్రజలు అక్కడ కలిసి జీవిస్తూ అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు.




దేశంలో యువత శాతం ఇరవై ఆరు కాగా, బిహార్లో అది ముప్పై ఆరు శాతంగా ఉండటం విశేషమని చెప్పారు. ఈ సామర్థ్యాన్ని వినియోగించుకునేందుకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి కోసం కేంద్ర బడ్జెట్‌లో నాలుగు లక్షల కోట్ల రూపాయలు కేటాయించినట్లు వెల్లడించారు.

బిహార్ ప్రజలు అరాచక పాలనను తిరస్కరించి అభివృద్ధి, స్థిరత్వం వైపు అడుగులు వేశారని, అందుకే భారీ ప్రజాభిమానంతో భారతీయ జనతా పార్టీకి మద్దతు లభించిందని ఈటెల రాజేందర్ అన్నారు. తెలంగాణలో నివసిస్తున్న ప్రతి బిహారీ సోదరుడు, సోదరికి పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. స్వాతంత్ర్యానికి ముందు నుంచే దేశ అభివృద్ధిలో భాగస్వాములైన బిహార్ ప్రజలు, భవిష్యత్తులోనూ దేశ పురోగతికి కీలకంగా నిలుస్తారని చెప్పారు.

# రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై హరీష్ రావు తీవ్ర విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

స్వయంగా నేర చర్యలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ద్వారా ప్రజలను ఆస్తుల ధ్వంసం, భౌతిక దాడుల వైపు రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు.

శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన పోలీస్ వ్యవస్థ ఎటు పోయిందని హరీష్ రావు ప్రశ్నించారు. ముఖ్యమంత్రి, హోంమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి ఇంత బహిరంగంగా నేరాలకు, విద్వేషాలకు పిలుపునిస్తుంటే రాష్ట్ర డీజీపీ ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన నిలదీశారు. చట్టాన్ని అమలు చేయాల్సిన వ్యవస్థ రాజకీయ ఒత్తిళ్లకు లోనవుతోందా అన్న అనుమానాలు కలుగుతున్నాయని వ్యాఖ్యానించారు. రాజకీయంగా ఎదుర్కోలేక భౌతిక దాడులు, ఆస్తుల విధ్వంసానికి పిలుపునివ్వడం రేవంత్ రెడ్డి దిగజారుడుతనానికి నిదర్శనమని హరీష్ రావు విమర్శించారు. ఇలాంటి చర్యలతో తెలంగాణలో అరాచక వాతావరణాన్ని సృష్టించాలని చూస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ పోరాటం ప్రజల మధ్యనే జరగాలి కానీ, హింసతో కాదని ఆయన స్పష్టం చేశారు.



# గ్రేటర్ హైదరాబాద్ ట్రాఫిక్ సమస్యలపై ప్రభుత్వం ఫోకస్

(మొదటి పేజీ తరువాయి)

కనుగొనడమే లక్ష్యంగా ఈ బదిలీలు చేపట్టినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో మంచి పనితీరు కనబరిచిన యువ ఐపీఎస్ అధికారులకు ట్రాఫిక్ విభాగంలో కీలక బాధ్యతలు అప్పగించినట్లు వెల్లడించారు.

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని డీజీపీ గుర్తుచేశారు. ఆ దిశగా ఇప్పటికే చర్యలు కొనసాగుతున్నాయని, ఇప్పుడు ట్రాఫిక్ నియంత్రణ, అమలుపై ప్రత్యేకంగా దృష్టి సారించామని తెలిపారు.

ఈ బదిలీలతో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండతో పాటు కొత్తగా ఏర్పాటైన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ వ్యవస్థను మరింత బలోపేతం చేయనున్నారు. కొత్తగూడెం అదనపు ఎస్పీగా పనిచేసిన అవినాశ్ కుమార్‌ను హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీగా, ఉట్నూర్ అదనపు ఎస్పీగా ఉన్న కాజల్‌ను ట్రాఫిక్ డీసీపీగా నియమించారు. అలాగే జి. చందన దీప్తిని ఫ్యూచర్ సిటీ అదనపు కమిషనర్‌గా (అడ్మిన్ & ట్రాఫిక్),



అభిషేక్ మహంతిని రాష్ట్రవ్యాప్తంగా అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఐజీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.





# ఎన్టీఆర్ విగ్రహానికి ఘన నివాళులు.!

- **సామాన్యుడికి గౌరవం తీసుకొచ్చిన మహానేత.**
- **సర్పంచ్ దొడ్డా రాజేంద్ర ప్రసాద్.**

**సత్తుపల్లి, జనవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం సమీపంలోని ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన నందమూరి తారక రామారావు విగ్రహం వద్ద వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బేతుపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ దొడ్డా రాజేంద్ర ప్రసాద్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సినీ రంగం ద్వారా సామాన్యుడికి గౌరవం తీసుకొచ్చిన అరుదైన వ్యక్తిత్వం ఎన్టీఆర్దని పేర్కొన్నారు. తెలుగు సినిమా ఖ్యాతిని విశ్వవ్యాప్తంగా చాటిచెప్పిన మహానటుడిగా ఆయన స్థానం చిరస్థాయిగా నిలిచిందన్నారు. పురాణ పాత్రల ద్వారా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రజల మనసుల్లో బలంగా నాటిన ఘనత ఎన్టీఆర్కే దక్కుతుందని తెలిపారు. రాజకీయాల్లోకి అడుగు పెట్టి ప్రజాసేవనే లక్ష్యంగా పాలన సాగించిన ఎన్టీఆర్ పేదల సంక్షేమానికి అనేక సంస్కరణలు అమలు చేశారని గుర్తు చేశారు. రూపాయి కిలో బియ్యం పథకం ద్వారా పేద కుటుంబాలకు అండగా నిలిచారని, మహిళలకు గౌరవం, గ్రామీణాభివృద్ధి, సామాజిక న్యాయం ఆయన పాలనలో ప్రధాన లక్ష్యాలుగా కొనసాగాయని వివరించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభిమానులు, టిజిఐడిసి చైర్మన్ మువ్వా విజయబాబు అభిమానులు, కొత్తూరు కోటేశ్వరరావు
దేవరపల్లి ప్రవీణ్, దొడ్డ కిషోర్, ధరావత్ నాగరాజు, కొంగర రమేష్, సిద్ధినబోయిన సత్యనారాయణ, మట్ట శివ, అల్లిక సాంబ్బశివరావు, వెంపాటి సతీష్
మాతూరి జనార్ధన్, ఎన్టీఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎన్టీఆర్కు ఘన నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ఆయన చూపిన ప్రజాసేవ మార్గాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## చర్లపల్లిలో ఘనంగా ఎన్టీఆర్ 30వ వర్ధంతి



**చర్లపల్లి, జనవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన మహానీయుడు నందమూరి తారక రామారావు అని చర్లపల్లి టీడీపీ కాంటెస్టెంట్ కార్పొరేటర్, జిల్లా సీనియర్ టీడీపీ నాయకులు రుద్రగోని రాంచందర్ గౌడ్ అన్నారు.నందమూరి తారక రామారావు 30వ వర్ధంతి సందర్భంగా చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి చౌరస్తాలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగువారి ఆత్మగౌరవం కోసం పుట్టిందే తెలుగుదేశం పార్టీ అని, పార్టీని స్థాపించి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత ఎన్టీఆర్కే దక్కుతుందన్నారు. ఎన్టీఆర్ పాలనలో పేదలకు గౌరవం, సమానత్వం లభించిందని, ఆయన ఆశయాలను ప్రతి కార్యకర్త కొనసాగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాగీరు సత్యనారాయణ గౌడ్, బింగి బిక్షపతి గౌడ్, ఆర్. నాథం గౌడ్, కాసులనందం, సత్యం యాదవ్, సురేష్ గుప్తా, కొమ్ము ఉపేందర్, బాలకృష్ణ గౌడ్, బీరప్ప, వై. రవికుమార్, గడ్డం కృష్ణ, కె. కుమార్, పి. శ్రీనివాస్, శ్రీకాంత్ గౌడ్, ఆటోగిరి నరసింహాచారి, రమేష్, సునీల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.





# వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే

- **మెచ్చా నాగేశ్వరరావు.**

**అశ్వారావుపేట, జనవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):** దమ్మపేట మండలం గోపాలపురం గ్రామంలో గోపాలపురం, గుర్వాయిగూడెం, జమేధారుబంజరు గ్రామాల యువత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో స్వయంగా వాలీబాల్ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, క్రీడలు మానసికంగా, శారీరకంగా దృఢత్వాన్ని పెంపొందిస్తాయని, ప్రతి యువకుడు క్రీడల్లో పాల్గొని ప్రతిభను చాటుకోవాలని పిలుపునిచ్చారు. అధికారంలో ఉన్నా లేకపోయినా క్రీడల అభివృద్ధికి, యువతకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, కొయ్యల అచ్యుత్ రావు, మాజీ వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, దారా యుగంధర్, సోయం వీరభద్రం, మన్నెం అప్పారావు, పాశం ప్రసాద్, యార్లగడ్డ శ్రీను, అశోక్, ఏసు, శ్రీను, రాంబాబు, పిట్టల నవీన్, పానుగంటి గణేష్, లక్కీ, నాని తదితరులు పాల్గొన్నారు.

## గొల్లపల్లి రిజర్వాయర్‌పై బీఆర్ఎస్ నీతిమాలిన రాజకీయాలు



- **నాడు జీవోలు... నేడు ధర్నాలు**
- **గోపాల్పేట మండల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సత్యశీలా రెడ్డి**

**గోపాల్పేట,జనవరి18(తెలంగాణ ముచ్చట్లు):** గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణం విషయంలో బీఆర్ఎస్ పార్టీ నీతిమాలిన రాజకీయాలకు తెరలేపిందని గోపాల్పేట మండల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సత్యశీలా రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. వనపర్తి నియోజకవర్గానికి వరప్రదాయినిగా మారనున్న గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు రావడాన్ని సహించలేక బీఆర్ఎస్ నాయకులు తెరచాటు రాజకీయాలు, ధర్నాలు చేస్తున్నారని ఆరోపించారు.గొల్లపల్లి రిజర్వాయర్‌తో పాటు మరో ఇరవై రిజర్వాయర్ల ఏర్పాటుకు 2016లోనే నాటి ప్రభుత్వం జీవోలు జారీ చేసిన విషయాన్ని మరిచి, నేడు అదే ప్రాజెక్టును వ్యతిరేకించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. 2016 అక్టోబర్ 21న జీవో నంబర్ 941 జారీ కాగా, 2018 ఫిబ్రవరి 26న సర్వేలు, మ్యాపింగ్ పూర్తయ్యాయని గుర్తు చేశారు.ఈ రిజర్వాయర్ నిర్మాణంతో వనపర్తి నియోజకవర్గంలోని 42,663 ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు.నాడు భూములు కోల్పోయే రైతులకు ఎకరాకు కేవలం ఆరు లక్షల యాభై వేల రూపాయల నష్టపరిహారం మాత్రమే ప్రకటించిన బీఆర్ఎస్ ప్రభుత్వం, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇరవై లక్షల రూపాయలకు పైగా నష్టపరిహారం చెల్లించేందుకు ముందుకు వచ్చిందని సత్యశీలా రెడ్డి తెలిపారు.గొల్లపల్లి, చీర్కపల్లి గ్రామాలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని నిపుణుల బృందం తేల్చి చెప్పిందని పేర్కొన్నారు.వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా వనపర్తి నియోజకవర్గానికి చుక్క నీరు కూడా రాకపోవడంపై బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఎన్ని ధర్నాలు, ఎన్ని కుయుక్తులు చేసినా గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణం తప్పకుండా జరిగి తీరుతుందని, తద్వారా వనపర్తి నియోజకవర్గానికి పూర్తిస్థాయిలో సాగునీరు అందుతుందని సత్యశీలా రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# మౌని అమావాస్య అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్, జనవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం రామంతపూర్‌లోని శ్రీ నల్ల పోచయ్య దేవాలయం వద్ద ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మౌని అమావాస్య అన్నదాన కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.ఆదివారం నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమానికి పరమేశ్వర్ రెడ్డితో పాటు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, “అన్నదానం మహాదానం అని పెద్దలు చెప్పారు. ఎందుకంటే అన్నం మనిషి జీవనానికి ఆధారం. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం అంటే వారికి జీవశక్తిని అందించినట్టే. మన దగ్గర ఉన్నదానిలో కొంత భాగాన్ని అవసరమైన వారికి పంచడమే నిజమైన భగవంతుని సేవ” అని పేర్కొన్నారు.అన్నదానం వంటి పుణ్యకార్యాల్లో అందరూ భాగస్వాములై మంచి సమాజ నిర్మాణానికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ 65వ నెల అమావాస్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా సంబు పాండయ్య, జీఎస్ కొత్తపల్లి రమేష్, ట్రెజరర్ బోనగిరి శ్రవణ్ కుమార్, ఆకారపు అరుణ్ కుమార్, రామంతపూర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లపు శ్రీకాంత్ యాదవ్, ఉపేందర్ రెడ్డి, బుల్లెట్ అశోక్, పోలా వెంకటేశ్వర్లు విశ్వనాథ, మంజునాథ, పోకల సత్యనారాయణ, దొడ్డి అశోక్‌తో పాటు కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మణిగిల్ల గ్రామంలో మహిళా సంఘాల సమావేశం



- **సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు మహిళా సంఘాల ఘన సన్మానం**

**పెద్దమందడి,జనవరి18(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం మనిగిల్ల గ్రామంలో మహిళా సంఘాల సభ్యుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశం హరిత మేడం అధ్యక్షతన జరిగింది. మహిళా సంఘాల గుంపుల నిర్వహణ, మహిళా సంఘ సభ్యుల పొదుపు అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు.ఈ సమావేశంలో పుస్తక సంరక్షకురాలు శివమ్మతో పాటు మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.మహిళల ఆర్థికాభివృద్ధికి పొదుపు ఎంతో కీలకమని, సంఘాల ద్వారా మహిళలు స్వావలంబన సాధించవచ్చని వారు వివరించారు .ఈ కార్యక్రమంలో గ్రామ నూతన సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ ముప్పూరు గణేష్ కుమార్‌లను మహిళా సంఘాల నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు .ఈ సమావేశానికి గ్రామ రెండో వార్డు సభ్యుడు శ్రీకాంత్ రెడ్డి, గ్రామ యువత ప్రేమ్ కుమార్ రెడ్డి, అశోక్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# తెలంగాణ రుచులకు రేవంత్ ఫిదా!



**ఖమ్మం బ్యూరో, జనవరి 18(తెలంగాణ ముచ్చట్లు):** అచ్చమైన తెలంగాణ ఇంటి వంటల రుచులు... ఆత్మీయ ఆతిథ్యం... సంప్రదాయ పరిమళం... ఇవన్నీ కలిసిన ప్రత్యేక విందు ఖమ్మంలో జరిగింది. ఆదివారం ఖమ్మం జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నివాసంలో ఘనమైన తెలంగాణ వంటకాల విందు ఏర్పాటు చేశారు.

సీఎం ఫిదా

మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆహ్వానంతో ఏర్పాటు చేసిన ఈ విందులో స్వచ్ఛమైన తెలంగాణ రుచికి సీఎం రేవంత్ రెడ్డి ఫిదా అయ్యారు. “భోజనం అదిరింది... ఆతిథ్యం మెరిసింది” అన్నట్టుగా సాగిన ఈ విందులో తెలంగాణ నేటివిటీ ప్రతి వంటకంలో ఉట్టిపడింది. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం, సహచర మంత్రులు, ఇతర ముఖ్యులు విందుకు హాజరయ్యారు. ఇది పక్కా తెలంగాణ ఇంటి వంట రుచి అని పేర్కొన్నారు. తెలంగాణ స్టైల్లో వండిన ఘాటైన నాటుకోడి పులుసు...నోరూరించే రొయ్యల ఇగురు...చేపల కూర... అదిరిపోయే మటన్ ఫ్రై...ప్రత్యేక రుచితో చేసిన మటన్ కీమా రుచి చూసిన సీఎం వాటిని ఇష్టంగా ఆరగించారు. దాదాపుగా 17 రకాల నోరూరించే వంటకాలతో సీఎంకు రాజభోజనం వడ్డించారు.

వంటింటిని పర్యవేక్షించిన మంత్రి సతీమణి మాధురి

ఈ విందులో మంత్రి సతీమణి పొంగులేటి మాధురి ప్రతి వంటకం సంప్రదాయ రుచులు తగ్గకుండా ఉండేలా స్వయంగా పర్యవేక్షించి తయారు చేయించారు.

మాంసాహారం... శాఖాహారం రెండూ విశేషమే

మాంసాహారంతో పాటు వేడివేడి జొన్న రొట్టెలు, రుచికరమైన వెజ్ పలావ్, క్యారెట్ -కొబ్బరి ఇగురు, పచ్చిమిర్చి పచ్చడి వంటి శాఖాహార వంటకాలు కూడా సీఎంను విశేషంగా ఆకట్టుకున్నాయి.


శాలువా సత్కారం...హస్తకళా బహుమతి

భోజనం అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శాలువాతో సత్కరించి, హస్తకళా పెయింటింగ్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి దంపతులు, మంత్రి సోదరుడు పొంగులేటి ప్రసాద్ రెడ్డి బహూకరించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం..

## సీఎం రేవంత్ రెడ్డి





- నర్సింగ్ కళాశాలలో జపనీస్, జర్మన్ భాషలు నేర్పేందుకు చర్యలు
- 108 కోట్ల 60 లక్షలతో నిర్మించే జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు శంకుస్థాపన
- 162 కోట్ల 54 లక్షలతో మున్నేరు నుండి పాలేరు లింక్ కెనాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన
- 45 కోట్ల 50 లక్షలతో కూసుమంచి 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన
- 25 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాలకు ప్రారంభోత్సవం
- 19 కోట్ల 90 లక్షల 50 వేలతో నిర్మించిన వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రారంభోత్సవం
- ఏదులాపురం మున్సిపాలిటీ ప్రాంతంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి



**ఖమ్మం బ్యూరో, జనవరి- 18(తెలంగాణ ముచ్చట్లు):** విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

ఆదివారం ఖమ్మం జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇంచార్జి మంత్రి వర్యులు వాకాటి శ్రీహరి, నీటిపారుదల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ హౌసింగ్ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు లతో కలిసి పర్యటించారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రికి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్ ఘన స్వాగతం పలికారు.

పాలేరు నియోజకవర్గ పరిధి ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలో 108 కోట్ల 60 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల నూతన భవనాలకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసి భూమి పూజ నిర్వహించారు. కూసుమంచిలో 5 ఎకరాల విస్తీర్ణంలో 45 కోట్లతో నిర్మించనున్న 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి, 162 కోట్ల 54 లక్షలతో మున్నేరు పాలేరు లింక్ కేనాల్ నిర్మాణ పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు.

అలాగే 25 కోట్ల రూపాయలతో 5 ఎకరాల విస్తీర్ణంలో నూతనంగా నిర్మించిన నర్సింగ్ కళాశాలను, మద్దులపల్లిలో 23 ఎకరాల విస్తీర్ణంలో దాదాపు 20 కోట్ల రూపాయలతో నిర్మించిన మార్కెట్ యార్డును ప్రారంభించారు.

అనంతరం నర్సింగ్ కళాశాలలో విద్యార్థులతో *సీఎం రేవంత్ రెడ్డి* విద్యార్థినులకు నర్సింగ్ కళాశాల నూతన భవన ప్రారంభోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. విద్య, వైద్యం ప్రజా ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని అన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన విద్య, నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని అన్నారు.

సమాజంలో వైద్య రంగానికి అత్యంత విలువ ఉందని, ఆపద సమయంలో ప్రజలు నమ్మకంతో ఆసుపత్రులకు వస్తారని, విధుల నిర్వహణలో చిన్న నిర్లక్ష్యం చూపిన ప్రాణ నష్టం, ఒక కుటుంబం జీవనాధారం కోల్పోయే ప్రమాదం ఉంటుందని, కాబట్టి విధి నిర్వహణలో వ్యక్తిగతంగా ఉన్న ఇబ్బందులు, సమస్యలను పక్కన పెట్టాలని అన్నారు.

విధుల నిర్వహణలో బాధ్యతతో నర్సులు పని చేయాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండా విదేశాలలో కూడా బీఎస్సి నర్సింగ్ చదివిన విద్యార్థులకు మంచి డిమాండ్ ఉందని అన్నారు. గతంలో ఇంజనీరింగ్ చదివిన వారికి విదేశాలలో ఎక్కువ అవకాశాలు దక్కాయని, నేడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని వైద్య రంగంలో అనేక ఉపాధి అవకాశాలు విదేశాలలో ఉన్నట్లు సీఎం రేవంత్ తెలిపారు.

జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా పర్యటనలో అక్కడ లక్షలాదిగా నర్సుల కొరత ఉన్నట్లు గుర్తించామని అన్నారు. జపాన్ లో ఏజింగ్ సమస్య వల్ల అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మన నర్సింగ్ విద్యార్థులకు అక్కడ సాఫ్ట్వేర్ ఇంజనీర్ కంటే ఎక్కువ జీతభత్యాలతో ఉపాధి అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి అన్నారు.

మన విద్యార్థులకు అక్కడి భాష, సంస్కృతి నేర్పేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నర్సింగ్ కళాశాలలో జపనీస్, జర్మన్ భాషలు నేర్పేందుకు అవసరమైన చర్యలు చేపట్టామని అన్నారు. జపాన్, జర్మనీ ప్రభుత్వాలతో తెలంగాణ ప్రభుత్వం అవసరమైన ఒప్పందాలు చేసుకున్నట్లు సీఎం తెలిపారు.

నర్సింగ్ విద్యార్థులు బాగా చదువుకొని భవిష్యత్తులో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ఆదర్శవంతంగా విధులు నిర్వహించాలని, నర్సింగ్ విద్యార్థినులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు సీఎం తెలిపారు.

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిధులు మంజూరు చేసి నర్సింగ్ కళాశాల నిర్మించామని, ఇక్కడ చదివే విద్యార్థినులను దృష్టిలో పెట్టుకుని అవసరమైన అన్ని మౌళిక వసతులను కల్పించడం జరిగిందని అన్నారు. రెవెన్యూ హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత నర్సింగ్ కళాశాలతో పాటు హాస్టల్ భవనాలను అధునాతన సాంకేతికతను వినియోగిస్తూ మంచి సదుపాయాలతో నిర్మించడం జరిగిందని , దీనికి సహకరించిన ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం లకు మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నర్సింగ్ విద్యార్థినులు మాట్లాడుతూ మంచి నర్సింగ్ కళాశాల భవనం అందించినందుకు ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం అందించిన సదుపాయాలను వినియోగించు కుంటూ భవిష్యత్తులో వైద్య రంగంలో రోగులకు మంచి సేవ చేస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీ లు రామసహాయం రఘురాం రెడ్డి, మల్లు రవి, ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్టా రాగమయి, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, మువ్వా విజయ్ బాబు, నాయుడు సత్యనారాయణ, ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాధ బాబు, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదిత



## ఎన్టీఆర్ 30వ వర్ధంతి

## హెచ్‌బీ కాలనీలో టీడీపీ ఘన నివాళులు

**నాచారం, జనవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):** నందమూరి తారక రామారావు 30వ వర్ధంతిని పురస్కరించుకుని ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ పరిధిలోని మీర్పేట్ హెచ్‌బీ కాలనీ ఫేజ్-1 చౌరస్తాలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. హెచ్‌బీ కాలనీ టీడీపీ డివిజన్ పార్టీ అధ్యక్షులు సాంబశివరావు, కార్యదర్శి జిల్లపల్లి యాదగిరి, మాజీ అధ్యక్షులు ప్రసాద్ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్ర మరియు మేడ్చల్ జిల్లా సీనియర్ నాయకులు టీజీకే మూర్తి, అశోక్ కుమార్ గౌడ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం టీజీకే మూర్తి మాట్లాడుతూ, స్వర్గీయ ఎన్టీఆర్ సినీ రంగంలో నట సామ్రాట్‌గా, రాజకీయ రంగంలో ప్రజానాయకుడిగా తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. రూపాయికి కిలో బియ్యం వంటి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదల జీవితాల్లో వెలుగు నింపిన మహానుభావుడని కొనియాడారు.ఎన్టీఆర్ సినీ, రాజకీయ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని నేటి యువత ఆయన అడుగుజాడల్లో నడిచినప్పుడే ఆయనకు నిజమైన నివాళులు అర్పించినట్టవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ డివిజన్ సీనియర్ నాయకులు వీరభద్రరావు, అమర్ కుమార్‌తో పాటు పార్టీ కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు టీఆర్‌పీ సిద్ధం

- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు బీ–ఫారం హామీ
- టీఆర్‌పీ వనపర్తి జిల్లా యూత్ అధ్యక్షుడు జి. రవికుమార్



**వనపర్తి,జనవరి18(తెలంగాణ ముచ్చట్లు):** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) పూర్తిగా సిద్ధమైందని ఆ పార్టీ వనపర్తి జిల్లా యూత్ అధ్యక్షుడు జి. రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ, పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపు మేరకు, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు బొడ్డుపల్లి చంద్రశేఖర్ ఆదేశాల ప్రకారం టీఆర్‌పీ అభ్యర్థులు వనపర్తి, పెబ్బేరు, కొత్తకోట, ఆత్మకూర్, అమరచింత మున్సిపాలిటీల్లో బరిలోకి దిగుతున్నట్లు వెల్లడించారు.గ్రామ, మండల స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ముందుకు సాగుతున్నామని తెలిపారు.మున్సిపల్ ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ తరఫున బీ-ఫారాలు అందజేస్తామని స్పష్టం చేశారు.తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ప్రశ్నించే గొంతుకగా, బడుగు-బలహీన వర్గాల ఆశాజ్యోతిగా నిలిచిన తీన్మార్ మల్లన్న సామాజిక న్యాయం, బహుజన రాజ్యం లక్ష్యంగా సాగిస్తున్న పోరాటానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. బీసీ ప్రజల రాజ్యం స్థాపన కోసం టీఆర్‌పీ మరింత బలంగా ముందుకు సాగుతుందని అన్నారు.రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జెండాను ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీసీల హక్కుల కోసం పుట్టిన పార్టీ టీఆర్‌పీ అని, బీసీ అభ్యర్థులను నిలబెట్టి అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. ప్రజలు ఆలోచించి టీఆర్‌పీ పార్టీకి పట్టం కట్టాలని ఆయన కోరారు.

# ఖబడ్దార్ ఎబిఎన్ రాధాకృష్ణ


- మచ్చలేని రాజకీయ నాయకులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- దళిత సామాజిక వర్గానికి చెందిన భట్టి పై కావాలని దుష్ప్రచారం చేస్తున్నారు
- తీవ్రంగా ఖండించిన జిల్లా కాంగ్రెస్ నాయకులు వేల్పుల మురళి



**ఖమ్మం బ్యూరో, జనవరి 18(తెలంగాణ ముచ్చట్లు):** ఎబిఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ తొలి పలుకులతో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కపై మీకున్న అక్కసుతో లేనిపోని కథనాలు వండివడ్చారు ప్రజా పాలన తో రాష్ట్రంలో సిఎం రేవంత్ రెడ్డి తో కలిసి ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని జిల్లా కాంగ్రెస్ నాయకులు ఏర్పుల మురళి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్న నాయకులు భట్టి విక్రమార్క దళిత సామాజిక వర్గానికి చెందిన భట్టి ఉన్నతమైన పదవిలో ఉండటం ఇష్టం లేకే మీ దొర అహంకారంతో బడుగు బలహీన వర్గాల నాయకుడు భట్టి పై కావాలని పని కట్టుకుని ఇష్టారాజ్యంగా నిరాధారమైన ఆరోపణలు చేస్తే ప్రజలు ఊరుకోబోరని భేషరతుగా క్షమాపణలు చెప్పాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు వేల్పుల మురళి డిమాండ్ చేశారు

# భూకబ్జాదారుల నుండి రక్షణ కల్పించండి

- పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు.
- న్యాయం చేయాల్సిన పోలీసులు కోర్టుకెల్లమని ఉచిత సలహా.
- దాడి చేసిన వారికే వత్తాసు



**హసన్ పర్తి,జనవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):** భూకబ్జాదారుల నుండి ప్రాణ రక్షణ కల్పించి మాకు న్యాయం చేయాలని బాదితురాలు శనివారం హసన్ పర్తి పోలీసులను ఆశ్రయించింది. అయితే ఫిర్యాదు స్వీకరించి విచారణ అధికారులుగా వచ్చిన పోలీసులు మాత్రం పట్టాదారు పాసుపుస్తకం కలిగి ఉన్న తనకు న్యాయం చేయకుండా తప్పుడు దృవపత్రాలు సృష్టించిన వారికి వత్తాసు పలుకుతున్నారని బాదితురాలు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. పైగా అక్రమంగా భూమి కబ్జా చేస్తున్నారని తనపై దాడి చేశారని ఫిర్యాదు చేస్తే మీరు కోర్టుకెళ్ళమని ఉచిత సలహా ఇస్తున్నారని ఆమె వాపోయింది. బాదితురాలి కదనం ప్రకారం వివరాల్లోకి వెళితే మండలంలోని అనంతసాగర్ కు చెందిన వైద్యుల సమ్మిరెడ్డిస్వరూప దంపతులకు ఇద్దరు సంతానం ఒక కూతురు. ఒక కుమారుడు. వీరికి వివాహం కాగా కుమారుడు విదేశాలలో స్థిరపడ్డాడు. సమ్మిరెడ్డి మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ సింగరేణిలో ఉద్యోగం చేసి ఇటివలే పదవీ విరమణ పొందాడు. ప్రస్తుతం దంపతులిద్దరు చిం తగట్టు క్యాంపులోనే నివాసముంటున్నారు. వీరికి అనంతసాగర్ రెవెన్యూ శివారులో 74/బి, 73/ఎ/1, 77/ఎ/1, 78/బి సర్వే నెంబర్లలో మొత్తం 403 ఎకరాల భూమి ఉంది. గత 40 సంవత్సరాలుగా ఉద్యోగ రీత్య మంచిర్యాలలోనే ఉండడంతో వీరి భూమి పై పాలివారి కన్ను పడింది. ఎలాగైన ఈ భూమిని కొట్టేయాలన్న దురాలోచనతో ఇదే గ్రామానికి చెందిన వైద్యుల తిరుపతి రెడ్డి మంచీర్యాలలో ఉద్యోగం చేసు _న్న వైద్యుల సమ్మిరెడ్డికి తెలియకుండానే గతంలోనే 113 గుంటల వ్యవసాయ భూమిని సమ్మిరెడ్డి తండ్రి మల్లారెడ్డికి మాయమాటలు చెప్పి తిరుపతిరెడ్డి అక్రమంగా ఆర్వోఆర్ చేయించుకున్నారు. వైద్యుల తిరుపతిరెడ్డికి మరో సోదరుడు వైద్యుల ప్రతాపడ్డికి పంపకాల విషయంలో తరచూ గొడవలు మె దలయ్యాయి. తిరుపతిరెడ్డి అక్రమంగా కబ్జా చేసుకొని మోసపూరితంగా ఆర్వోఆర్ చేసుకున్న భూమిని తన సోదరుడు ప్రతాపరెడ్డికి ఇవ్వకుండా తానే అనుభవిస్తున్నాడు. ఇద్దరు సోదరులకు సమాన వాటాలు రాకపోవడంతో వీరి మధ్య గొడవలు పోలీసు స్టేషన్ వరకు వెళ్లాయి. ఈ క్రమంలోనే వారిద్దరు ఒక్కటై పాలివాడైన వైద్యుల సమ్మిరెడ్డి భూమిపై కన్ను పడింది. పంట సాగుకు నీరు లేక పడావు పడి ఉన్న భూమిని ఎలాగైన కబ్జా చేయాలన్న దురాలోచనతో తప్పుడు పత్రాలు సృష్టించి సమ్మిరెడ్డి భూమిని అక్రమంగా కబ్జా చేస్తే ఇద్దరికి సమాన వాటాలు వస్తాయని వారికి దుర్బుద్ధి పుట్టింది. ఈ క్రమంలోనే సమ్మిరెడ్డి వారసత్వం ద్వారా అతని భార్య వైద్యుల స్వరూపకు పట్టాపాసు పుస్తకం ఉందని గ్రహించిన ప్రతాప్ రెడ్డి, తిరుపతిరెడ్డి సోదరులిద్దరు హద్దులు తొలగించి క్రమంగా కబ్జా చేసేందుకు కుట్ర చేశారు. ఈ క్రమంలోనే గత గతేడాది డిసెంబర్ నెలలో వైద్యుల స్వరూపకు సంబందించిన భూమిని సాగు చేశారు. ఈ విషయం తెలిసిన స్వరూప పోలీసులకు ఫిర్యాదు చేయడమే కాకుండా హద్దులు నిర్ణయించేందుకు మండల సర్వేయర్ కు దరఖాస్తు చేసుకుంది. దీంతో ప్రతాప్ రెడ్డి, తిరుపతిరెడ్డిలిద్దరితో పాటు వారి కుటుంబ సభ్యులు మండల సర్వేయర్ ను సర్వే చేయకుండా అడ్డుకొని ఇబ్బందులకు గురిచేయడం మొదలుపెట్టారు. పలుమార్లు సర్వేకు రాగా వారిని అడ్డుకుంటున్నారని బాదితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయి ఎనప్పటికి న్యాయం జరగలేదు. స్వరూప తన ప్రయత్నాన్ని వదులుకోకుండా న్యాయం కోసం పోరాడుతూనే ఉంది. 17వ తేదీ శనివారం ప్రతాపరెడ్డి, తిరుపతిరెడ్డి, ప్రమీలు కలిసి స్వరూప పట్టాభూమిని మరికొంత భాగాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తుండగా సమాచారం తెలిసిన బాదితురాలు అడ్డుకుంది. ఈ క్రమం లోనే ఘటన స్థలానికి చేరుకున్న స్వరూపను వారు నానా బూతులు తిడుతూ దాడి చేయగా బాధితురాలు 100 డయల్ కు కాల్ చేసి రక్షణ కోరింది. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బాదితురాలికి అండగా నిలిచి రక్షణ కల్పించారు. అనంతరం బాదితురాలు ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు ఆదివారం విచారణకు వెళ్ళి భూమి వివరాలను స్థానిక తహశీల్దారు రిపోర్టు తీసుకొని బాదితురాలికి న్యాయం చేయాల్సింది పోయి కబ్జాదారులకే వంతపాడినట్లు బాదితురాలు ఆవేధన వ్యక్తం చేస్తోంది. నిజానికి పట్టాపాసు పుస్తకాలు ఉండి కబ్జాలో సాగు చేసుకోవాల్సిన బాదితురాలు కబ్జాదారులు సాగు చేస్తుండగా అడ్డుకుంటున్నందుకు విచారణాధికారులు రెవెన్యూ అధికారుల రిపోర్టు లేకుండానే కోర్టుకు వెళ్లమనడంలో తిరకాసు ఏంటని బాధిత కుటుంబ సభ్యులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ విషయంపై వరంగల్ నగర పోలీసు కమిషనర్ ఏవిధంగా స్పందిస్తారో వేచి చూడాల్సిందే..

# ఘనంగా ఎన్టీఆర్ 30వ వర్ధంతి వేడుకలు



**నాచారం, జనవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ నందమూరి తారక రామారావు 30వ వర్ధంతి సందర్భంగా నాచారం ప్రాంతంలో తెలుగుదేశం పార్టీ నేతలు ఘనంగా నివాళులు అర్పించారు.తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌడెల్లి సావిత్రి, నాచారం సర్కిల్ అధ్యక్షులు ఏర్పుల నాగరాజు ఆధ్వర్యంలో నాచారం అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సినీ వినీలాకాశంలో ధృవతారగా వెలిగి, రాజకీయ రంగంలో అజేయుడిగా నిలిచిన మహానాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. తెలుగు వారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అని పేర్కొన్నారు.కిలో రూ.2ల బియ్యం పథకం, సామాజిక భద్రతా పింఛన్లు, పక్కా ఇళ్ల నిర్మాణం, రైతులకు ఉచిత విద్యుత్, మండల వ్యవస్థ ద్వారా స్థానిక స్వపరిపాలన, ఆడబిడ్డలకు ఆస్తిలో హక్కు, రాయలసీమ అభివృద్ధికి సాగు-తాగునీటి ప్రాజెక్టులు వంటి అనితరసాధ్యమైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్ర చరిత్రను మలుపుతిప్పిన నాయకుడు ఎన్టీఆర్ అని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో నాచారం సర్కిల్ తెలుగుదేశం పార్టీ నాయకులు ఏం.డి., గౌస్, ఇతగోని దర్శన్, ఊటుకురి సురేష్, రామచర్ల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ముచ్చట్లు క్యాలెండర్ ఆవిష్కరణ



**హసన్ పర్తి,జనవరి 18 ( తెలంగాణ ముచ్చట్లు):** ప్రజాసమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య తెలంగాణ ముచ్చట్లు దినపత్రిక వారధిగా నిలుస్తుందని హసన్ పర్తి ఎస్సై దేవేందర్ అన్నారు. హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రోజున 2026 తెలంగాణ ముచ్చట్లు క్యాలెండర్ ను ఎస్సై దేవేందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజల సమస్యలకు ప్రాధాన్యత ఇస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై గోవర్ధన్ స్టేషన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏ.ఎస్. రావు నగర్‌లో ఘనంగా ఎన్‌టీఆర్ 30వ వర్ధంతి



**కాప్రా, జనవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):** తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (ఎన్‌టీఆర్) 30వ వర్ధంతిని ఏ.ఎస్. రావు నగర్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కొత్త రామారావు, కమ్మవారి సేవా సమితి-కాప్రా (కె.ఎస్.ఎస్.కె) సభ్యులు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఎన్‌టీఆర్ పేదల అభ్యున్నతి, సామాజిక న్యాయం, తెలుగువారి గౌరవం కోసం చేసిన కృషి చిరస్మరణీయమని పాల్గొన్న నాయకులు కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.

## ఎన్టీఆర్ వర్ధంతి విగ్రహానికి పూలమాల వేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఏఎస్‌రావు నగర్, జనవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):** తెలుగు ప్రజల హృదయ సామ్రాట్, మాజీ ముఖ్యమంత్రి, దివంగత నటరత్న నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) 30వ వర్ధంతి సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఘన నివాళులు అర్పించారు. డా. ఏఎస్‌రావు నగర్ డివిజన్ పరిధిలోని జమ్మిగడ్డలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ,"ఎన్టీఆర్ తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహానేత. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అనేక పథకాలను అమలు చేసి, రాజకీయాల్లో విలువలు, ఆదర్శాలను నెలకొల్పిన మహోన్నత నాయకుడు ఎన్టీఆర్. ఆయన చేసిన సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమైనవి" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి, ఏఎస్‌రావు నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, పార్టీ నాయకులు బాలరాజు, మనెమ్మ రహీం, సతమ్మ, రమేశ్‌తో పాటు స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎన్టీఆర్ సేవలను స్మరించుకున్నారు.





# ఘనంగా 206వ వారం జ్ఞానమాల కార్యక్రమం

**కీసర, జనవరి 18 (తెలంగాణ ముచ్చట్లు-):** మేడ్చల్ జిల్లా కీసర మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కర్రె గణేష్, ప్రధాన కార్యదర్శి మంచాల సంజీవ ఆధ్వర్యంలో నిర్వహించిన 206వ వారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బోగారం గ్రామ మాజీ ఎంపీటీసీ, రాష్ట్ర బీజేపీ నాయకులు సింగిరెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సింగిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జ్ఞానమాల వంటి కార్యక్రమాలు సామాజిక చైతన్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు .ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బత్తుల ఆంజనేయులు, పులిపాక తిరుపతి, బొల్లి మహేష్, ముఖ్య సలహాదారులు దాయార బాల్ నర్సింహ, జిల్లా బీజేపీ నాయకులు గుండెబోయిన ఐలయ్య, మండల బీజేపీ ఉపాధ్యక్షులు ఊట్కూరు పవన్ గౌడ్ పాల్గొన్నారు.అలాగే బీఆర్ఎస్ కీసర గ్రామశాఖ అధ్యక్షుడు చినింగని బాల్ రాజ్, మాజీ కీసర వార్డు సభ్యులు శీలం మల్లేష్, తుడుం శ్రీనివాస్, అంబేద్కర్ సంఘం సీనియర్ నాయకులు చినింగని యాదగిరి, తుడుం బాల్ రాజ్, బీజేపీ కీసర గ్రామశాఖ అధ్యక్షుడు బండారు శ్రీనివాస్ రెడ్డి, బోగారం గ్రామశాఖ అధ్యక్షుడు దుర్గం వేణు గోపాల్ పాల్గొన్నారు.ఎస్సీ మోర్చా కీసర మండల ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీనివాస్, బూత్ అధ్యక్షుడు పండుగ మురళి, సీనియర్ బీజేపీ నాయకులు తిప్పాజి బాలచారి, దుర్గం వెంకటేష్ యాదవ్, మాజీ అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షుడు మంచాల జగన్నాథం, బొల్లి వీరేశం, మాజీ కోశాధికారి కానుకుంట్ల శ్యామ్ కుమార్, మాజీ సంయుక్త కార్యదర్శి గంగి సుధాకర్ హాజరయ్యారు.మెడ్చల్ జిల్లా సూర్య పత్రిక స్టాఫర్ పన్నాల బాల్ రెడ్డి, పీపుల్స్ డైరీ పత్రిక విలేకరి తుడుం బాలకృష్ణ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





# ఎన్టీఆర్ 30వ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి ఘన నివాళులు

**నాచారం, జనవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్‌లో నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) 30వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌బీ కాలనీలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు .ఈ కార్యక్రమంలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ పాల్గొని ఎన్టీఆర్ సేవలను స్మరించారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహానాయకుడు ఎన్టీఆర్ అని ఆయన కొనియాడారు.ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు రామ్ ప్రదీప్ మునుగంటి, బ్రహ్మాచారి, తిమ్మారెడ్డి, వీరభద్రరావు, ప్రసాద్, సాంబ, సాయి, మురళి తదితర నాయకులు పాల్గొన్నారు. అలాగే పెద్ద సంఖ్యలో ఎన్టీఆర్ అభిమానులు హాజరై ఘన నివాళులు అర్పించారు.





# సీపీఐ శతాబ్ది ముగింపు సభకు తరలివెళ్లిన కమ్యూనిస్టులు

**ఎల్కతుర్తి, జనవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):** భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను విజయవంతం చేయాలనే లక్ష్యంతో ఎల్కతుర్తి మండలం నుంచి కమ్యూనిస్టులు ఖమ్మం వైపు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు ఎర్ర జెండాలతో, నినాదాలతో ఖమ్మం ప్రయాణం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎల్కతుర్తి మండల కేంద్రం నుంచి 'చలో ఖమ్మం' కార్యక్రమానికి బయలుదేరిన బస్సులకు గోపాల్పూర్ సర్పంచ్ కర్రె లక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఊట్కూరి రాములు, లక్ష్మణ్, సీపీఐ మండల కార్యదర్శి శనిగరపు రాజ్ కుమార్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు మద్రి శ్రీనివాస్, కామర వెంకటరమణ పాల్గొన్నారు. అలాగే తండ మొండయ్య, నిమ్మల మనోహర్, సూర మొగిలి, మోహన్ రెడ్డి, ఆరెపల్లి చంద్రమౌళి, అంబాల స్వామి, మద్రిపల్లి తిరుమల, గడ్డం లలిత తదితర సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సీపీఐ వందేళ్ల పోరాట చరిత్రకు ప్రతీకగా నిర్వహిస్తున్న శతాబ్ది ముగింపు సభను చారిత్రాత్మకంగా విజయవంతం చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం సాగుతున్న ఉద్యమాలకు ప్రజలు మద్దతు ఇవ్వాలని నాయకులు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.





# కుషాయిగూడ రెడ్డి సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

**కుషాయిగూడ, జనవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):** ుషాయిగూడ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, రెడ్డి సంఘం సామాజిక సేవల్లో ముందుండి పనిచేయడం అభినందనీయమని అన్నారు. సంఘం చేపడుతున్న కార్యక్రమాలు యువతకు ప్రేరణగా నిలుస్తున్నాయని, కుషాయిగూడ ప్రాంత అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కుషాయిగూడ రెడ్డి సంఘం అధ్యక్ష కార్యదర్శి నాగిళ్ల బాల్ రెడ్డి, మొగిలి రాఘవరెడ్డి, చిటుకుల నర్సింహా రెడ్డి, రాఘవుల రాంరెడ్డి, బుచ్చన్న, శ్రీకాంత్ రెడ్డి, రావిపల్లి రవీందర్ రెడ్డి, తోటకూర సురేష్ రెడ్డి, రాగిడి చంద్రశేఖర్ రెడ్డి, మైపాల్ రెడ్డి, నాగిళ్ల నర్సింహ రెడ్డి, బొల్లంపల్లి రాంచందర్ రెడ్డి, యాదిరెడ్డి, విజేందర్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, రాం రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, వాసురెడ్డి, జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# పాముకు కోరల్లో విషం.. విపక్షానికి ఒంటి నిండా విషమే!

- ముస్సిపల్ ఎన్నికల్లోనూ డిపాజిట్లు గల్లంతు కావాలి : మంత్రి పొంగులేటి
- 69 శాతం పంచాయతీల స్ఫూర్తితో పట్టణాల్లోనూ పాగా వేద్దాం
- పేదవాడి పక్షపాతిగా ప్రజా ప్రభుత్వం.. విపక్షాల కారుకూతలు నమ్మొద్దు
- మద్దులపల్లి వేదికగా రూ. 361.55 కోట్ల అభివృద్ధి పనులకు 'సీఎం రేవంత్' శ్రీకారం

**ఖమ్మం బ్యూరో, జనవరి 18(తెలంగాణ ముచ్చట్లు):** "పాముకు కేవలం కోరల్లోనే విషం ఉంటుంది.. కానీ పదేళ్లపాటు రాష్ట్రాన్ని దోచుకుని, అప్పుల పాలు చేసిన ఆ నాయకులకు ఒంటి నిండా విషమే ఉంది. వారు చేసిన పాపాలు బయటపడతాయనే భయంతో ప్రజా ప్రభుత్వంపై నిత్యం విషం కక్కుతున్నారు" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం మద్దులపల్లిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపిన ఆయన, విపక్షాల తీరును ఎండగట్టారు.

**ప్రజా తీర్పుతో చెంప చెళ్లుమంది!**

అసెంబ్లీ, పార్లమెంటు, కంటోన్మెంట్ బై ఎలక్షన్లలో ప్రజలు ఇప్పటికే కాంగ్రెస్‌కు పట్టం కట్టారని పొంగులేటి గుర్తు చేశారు. "సెమీ ఫైనల్స్ అని కారుకూతలు కూస్తున్న చిచ్చర పిడుగులకు, టిల్లూలకు మొన్నటి పంచాయతీ ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 69 శాతం గ్రామ పంచాయతీలను కాంగ్రెస్ గెలుచుకోవడం మా ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన రెఫరెండం. ఇదే జోరు మున్సిపల్ ఎన్నికల్లోనూ కొనసాగాలి. ఉమ్మడి జిల్లాలోని ఏడు మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లో ప్రత్యర్థుల డిపాజిట్లు గల్లంతు చేసి, కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి" అని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.


**వృథా జలాలకు అడ్డుకట్ట.. సాగుకు భరోసా**

జిల్లా ప్రగతిలో సాగునీటి ప్రాజెక్టులు చారిత్రక మైలురాయిగా నిలుస్తాయని మంత్రి పేర్కొన్నారు. రూ. 162.54 కోట్లతో నిర్మించే మున్నేరుపాలేరు లింక్ కెనాల్ ద్వారా 1.50 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని వివరించారు. రూ. 108.60 కోట్లతో జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల, రూ. 45.50 కోట్లతో కూసుమంచిలో 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణాలకు శ్రీకారం చుట్టడం జిల్లా యువతకు, పేదలకు వరమని కొనియాడారు.

**కార్యకర్తలే నా బలం..**

తమను గెలిపించడానికి అహోరాత్రులు శ్రమించిన కార్యకర్తలను ప్రజాప్రతినిధుల స్థానంలో కూర్చోబెట్టే బాధ్యత తమదేనని మంత్రి భరోసా ఇచ్చారు. "మీ కష్టాన్ని నేను మరువను. పేదవాడికి భద్రత, భరోసా కల్పించడమే ధ్యేయంగా రేవంత్ రెడ్డి నాయకత్వంలో మా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఎన్ని అడ్డంకులు వచ్చినా అభివృద్ధి ఆగదు" అని స్పష్టం చేశారు.








# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా రెపరెపలాడాలి

- ఖమ్మం జిల్లాకు భారీ ఇండస్ట్రియల్ పార్కును కేటాయించాలి
- పాలేరు బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**ఖమ్మం బ్యూరో, జనవరి 18(తెలంగాణ ముచ్చట్లు):** సర్పంచ్ ఎన్నికల్లో 85% కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించుకొని రాష్ట్రానికి ఖమ్మం జిల్లా తలమానికంగా నిలిచింది రాబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండాను రెపరెపలాడించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులను కలిసి జిల్లాలో సాగునీటి పారుదల, విద్య, ఆరోగ్యానికి సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో అన్ని చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగానే జేఎన్టీయూ విశ్వవిద్యాలయం బ్రాంచ్, నర్సింగ్ కళాశాల, సాగునీటిపారుదలలో భాగంగా మున్నేరును పాలేరుకు లింక్ చేయడం వంటి పనులు చేపట్టినట్టు తెలిపారు. ఖమ్మం జిల్లాలో చదువుకున్న నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. వారికి ఉద్యోగాలు కల్పించడమే మిగిలింది భారీ పరిశ్రమలు జిల్లాకు వస్తేనే ఇది సాధ్యమని డిప్యూటీ సీఎం తెలిపారు. ఖమ్మం జిల్లాకు భారీ ఇండస్ట్రియల్ పార్కును కేటాయించాలని దాంతోపాటు ముఖ్యమైన ప్రాజెక్టులను జిల్లాకు అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిప్యూటీ సీఎం కోరారు.

# రేవంత్.. అసహనం ఎందుకు?

- పాలన చేతకాకే విపక్షాలపై విషం
- సీపీఐ వేదికపై చిల్లర రాజకీయాలా?
- మీ ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయో చెప్పండి?
- కమ్యూనిస్టులవి 'కమర్షియల్' రాజకీయాలే
- ధ్వజమెత్తిన బీజేపీ నేత పొంగులేటి సుధాకర్ రెడ్డి.

**ఖమ్మం, జనవరి 18(తెలంగాణ ముచ్చట్లు)**

రాష్ట్రంలో పాలన గాడి తప్పడం, ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రజా వ్యతిరేకత పెరుగుతుండటంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలో అసహనం పతాక స్థాయికి చేరిందని బీజేపీ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ, తమిళనాడుకర్ణాటక రాష్ట్రాల సహ ఇన్‌చార్జ్ డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన సీఎం తీరుపై నిప్పులు చెరిగారు. సీపీఐ శతవార్షికోత్సవ వేదికను కూడా తన రాజకీయ ఆక్రోశాన్ని వెళ్లగక్కడానికి వాడుకోవడం రేవంత్ రెడ్డి దివాలాకోరుతనానికి నిదర్శనమని మండిపడ్డారు.

**అడ్రస్ లేని గ్యారెంటీలు.. జనం ప్రశ్నల వర్షం**

"అధికారంలోకి వచ్చేందుకు ఆనాడు ఆర్భాటంగా ప్రకటించిన ఆరు గ్యారెంటీలు ఇప్పుడెక్కడ?" అని పొంగులేటి సూటిగా ప్రశ్నించారు. "రైతులకు భరోసా లేదు, యువతకు ఉపాధి లేదు, మహిళలకు రక్షణ లేదు. అన్ని వర్గాలను కాంగ్రెస్ నిలువునా మోసం చేసింది. ఇచ్చిన మాట నిలబెట్టుకోలేక, ప్రజల నుంచి వస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేక.. ముఖ్యమంత్రి బీజేపీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు" అని ఆయన దుయ్యబట్టారు.

**సిద్ధాంతాలు లేవు.. అంతా 'వ్యాపారమే'**



కమ్యూనిస్టు పార్టీలపై పొంగులేటి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఒకప్పుడు వర్గ పోరాటాలు, సిద్ధాంతాల గురించి మాట్లాడిన కమ్యూనిస్టులు.. నేడు కేవలం ఒకటి రెండు సీట్ల కోసం, ఉనికిని కాపాడుకోవడం కోసం దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. కమ్యూనిస్టు పార్టీలు నేడు 'పొలిటికల్ కమర్షియల్ అవుట్‌ఫిట్లు' (రాజకీయ వ్యాపార సంస్థలు)గా మారిపోయాయని ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాలగర్భంలో కలిసిపోతున్న పార్టీలతో జతకట్టి కాంగ్రెస్ నాటకాలాడుతోందని ఎద్దేవా చేశారు.

**మోదీ పాలనను చూసి ఓర్వలేకనే..**

సర్దార్ పటేల్ లాంటి మహనీయుడిని విస్మరించిన చరిత్ర కాంగ్రెస్‌ది అని, ఆ పార్టీకి రాజ్యాంగం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని పొంగులేటి స్పష్టం చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో డీబీటీ, పీఎం కిసాన్ వంటి పథకాలతో అవినీతి లేని పాలన అందుతోందని, ఇది చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ నేతలు విమర్శలకు దిగుతున్నారని అన్నారు. ప్రజలు బీజేపీ వెంటే ఉన్నారని ఇటీవలి ఎన్నికల ఫలితాలే నిరూపించాయని, రేవంత్ ఇకనైనా చిల్లర విమర్శలు మాని పాలనపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.

# శక్తి సాయి నగర్‌లో మహిళలకు చీరల పంపిణీ



**మల్లాపూర్, జనవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):** నాచారం సర్కిల్ పరిధిలోని శక్తి సాయి నగర్ డివిజన్‌లో మహిళా సోదరీమణులకు చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బిజెపి మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కౌన్సిల్ మెంబర్ సంగిశెట్టి రవీంద్ర సాగర్ ఆధ్వర్యంలో శక్తి సాయి నగర్ డివిజన్ బిజెపి కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమానికి ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బిజెపి రాష్ట్ర నాయకులు ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై మహిళా సోదరీమణులకు చీరలను పంపిణీ చేశారు.జనవరి 11, 2026న బిజెపి శక్తి సాయి నగర్ డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మొత్తం 164 రంగురంగుల ముగ్గులు వేశారు. రెండు గంటల పాటు శ్రమించి ముగ్గులు వేసిన మహిళల ఉత్సాహాన్ని ప్రశంసించిన ప్రభాకర్, ప్రతి మహిళకు ఒక చీరను బహుమతిగా అందజేస్తామని అప్పట్లో ప్రకటించారు. ఆ ప్రకటన మేరకు ఈ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ముందుగా ప్రకటించినట్లుగా ముగ్గుల పోటీలో మొదటి బహుమతి - రూ.5,000,రెండో బహుమతి - రూ.3,000,మూడో బహుమతి - రూ.2,000,నాలుగో బహుమతి - రూ.1,000,అలాగే ముగ్గుల పోటీలో పాల్గొన్న ప్రతి మహిళకు ప్రత్యేక బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బ్రహ్మాచారి, 19వ డివిజన్ బిజెపి అధ్యక్షులు రాంప్రదీప్, సీనియర్ నాయకురాలు అపర్ణ గౌడ్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు సవిత యాదవ్, 19వ డివిజన్ బిజెపి జనరల్ సెక్రటరీ రాజేశ్వర్, డివిజన్ సెక్రటరీ వి. రమేష్, పుణ్యవతి, డివిజన్ సీనియర్ నాయకులు పి. లింగం గౌడ్, వి. శ్రీనివాస్ సాగర్, శశిధర్ సాగర్ తదితర బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇంటి జాగాలు ప్రకటించాలి

- సీ.ఎం రేవంత్ రెడ్డిని కోరిన టి.డబ్ల్యూ.జె.ఎఫ్ జిల్లా అధ్యక్షుడు.





**ఖమ్మం బ్యూరో, జనవరి 18(తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం నగరంలో నిర్వహించిన, సీ.పీ.ఐ శతాబ్ది ఉత్సవాల సభకు విచ్చేసిన సందర్భంగా, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టి.డబ్ల్యూ.జె.ఎఫ్ హెచ్ 2843) ఖమ్మం జిల్లా అధ్యక్షుడు సంతోష్ చక్రవర్తి, వారి బృందం కలిసి వినతి పత్రం సమర్పించారు. సర్దార్ పటేల్ స్టేడియం మైదానంలో, రెండవ గేటు సమీపంలో ముఖ్యమంత్రి సభకు హాజరవుతున్న సమయంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా సంతోష్ చక్రవర్తి మాట్లాడుతూ,

గత మూడు దశాబ్దాలుగా జర్నలిస్టులు ఇంటి స్థలాల కోసం ఎదురు చూస్తున్నారని, గత ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలుకాలేదని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికైనా స్పష్టమైన ప్రకటన చేసి జర్నలిస్టుల గూడు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, కోరారు. జర్నలిస్టుల వృత్తి భద్రతకు, కుటుంబ స్థిరత్వానికి ఇంటి జాగాలు అత్యవసరమని వినతి పత్రంలో పేర్కొన్నారు.

సభకు హాజరవుతున్న తరుణంలో సమయాభావం కారణంగా ముఖ్యమంత్రి ఈ అంశాన్ని సూచన ప్రాయంగా స్వీకరించినట్లు, ఫోటోలకు కూడా సమయం లేదని సౌమ్యంగా తెలియజేశారని, టి.డబ్ల్యూ.జె.ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజెఎఫ్, (టీ.బీ.జే.ఏ) జిల్లా అధ్యక్షులు వందనపు సామ్రాట్ గుప్తా, టౌన్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు ఎలుగోటి వెంకట్, సహాయ కార్యదర్శి కుంభం రవికుమార్ మరియు ఫెడరేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# రజబ్ అలీ ఆశయ సాధన కోసం పూర్వవైభవం తీసుకురావాలి

- సిపిఐ నాయకులు మరియు సిపిఐ కార్యకర్తలు కష్టపడాలి
- సిపిఐ పంగిడి మాజీ ఎంపీటీసీ బోడ చిన్న నాయక్
- సిపిఐ పుటాని తండా శాఖ నాయకులు బానోతు నాగేశ్వరరావు

**ఖమ్మం బ్యూరో, జనవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):** భారత కమ్యూనిస్టు పార్టీ భారత గడ్డపై 100 శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఉద్యమాల ఖిల్లా అయిన ఖమ్మంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ విస్తృత ప్రచారం చేశారు. ఖమ్మం ఎస్ ఆర్ బి జి ఎన్ ఆర్ డిగ్రీ కళాశాల మైదానం యందు ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ... ఆనాటి కాలంలో పుటాని తండా గ్రామంలో రజబ్ అలీ ఆశయ సాధన కోసం వారి అడుగుజాడలో నడిచి, అమరులైన సిపిఐ నాయకులు భూక్య బిచ్చ నాయక్, బానోత్ బిచ్చ నాయక్, ఆశయాలను గుర్తు చేస్తూ పుటాని తండా ప్రజలు ముందుకు సాగాలన్నారు. పార్టీ నాయకులు పార్టీ సానుభూతి పరులు పుటానితండ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మాజీ ఎంపీటీసీ, గుగులోతు కనకమ్మ, గ్రామ నాయకులు బానోతు కిషన్, గమ్మ, తదితరులు పాల్గొన్నారు.







# మేడారంలో అమ్మవార్ల దర్శనం, జాతర ఏర్పాట్లపై సమీక్ష

- సమ్మక్క–సారలమ్మ వనదేవతలకు మొక్కులు చెల్లించిన మంత్రి
- గద్దెల శాశ్వత నిర్మాణాలపై ఆర్అండ్‌బి అధికారులతో చర్చ
- భక్తులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశాలు

**మేడారం, జనవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):**

మేడారంలోని సమ్మక్క-సారలమ్మ వన దేవతలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నట్లు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మహా గిరిజన జాతర ఏర్పాట్లు, అమ్మవార్ల గద్దెల శాశ్వత నిర్మాణాలపై ఆర్అండ్‌బి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

సమ్మక్క-సారలమ్మ మహా గిరిజన జాతర ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన పండుగగా గుర్తింపు పొందిందని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ జాతరను భక్తి, శ్రద్ధలతో అత్యంత ఘనంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అమ్మవార్ల గద్దెలకు శాశ్వత నిర్మాణాలు చేపట్టి, భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి వివరించారు. జాతర సందర్భంగా లక్షలాది మంది భక్తులు తరలివచ్చే నేపథ్యంలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. భద్రత, రవాణా, తాగునీరు, వైద్య సేవలు వంటి అంశాల్లో నిర్లక్ష్యం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.



# జనగామలో బీసీ జేఏసీ సభలో తీన్మార్ మల్లన్న గర్జన

- బీసీల జనాభాకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం లేదని ఆగ్రహం
- ఓటు విలువను కాపాడుకోవాలని బీసీలకు పిలుపు
- బీసీ రాజ్యం దిశగా అడుగులు వేయాల్సిన సమయం వచ్చిందని వ్యాఖ్య

**జనగామ, జనవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):**

జనగామలో నిర్వహించిన బీసీ జేఏసీ ఆత్మీయ అభినందన సభలో శాసన మండలి సభ్యుడు తీన్మార్ మల్లన్న తీవ్ర స్థాయిలో గర్జించారు. రాష్ట్రంలో కుక్కలు, పందుల సంఖ్యకు లెక్కలు ఉన్నాయని, కానీ బీసీలు ఎంతమంది ఉన్నారో స్పష్టమైన లెక్కలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ చైతన్యం పెరగాలని, బీసీలు తమ ఓటు విలువను తామే కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర జనాభాలో దాదాపు అరవై శాతం ఉన్న బీసీలకు కేవలం ఇరవై మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉండటం అన్యాయమని తీన్మార్ మల్లన్న అన్నారు. రాజకీయ పార్టీల దగ్గర బీ-ఫారాలు ఉండవచ్చని, కానీ ఓట్లు మాత్రం బీసీల దగ్గరే ఉన్నాయని స్పష్టం చేశారు. ఓటును అమ్ముకోవడం వల్లే బీసీలకు రాజకీయ బలం దూరమవుతోందని వ్యాఖ్యానించారు.

ఆత్మగౌరవంతో పోరాటం చేయాల్సిన అవసరం ఉందని, చివరి నిమిషం వరకు బీసీల హక్కుల కోసం తాను పోరాడుతూనే ఉంటానని మల్లన్న తెలిపారు. బీసీల అభివృద్ధికి ఖర్చు అయ్యేది బీసీల రక్తం, బీసీల శ్రమేనని అన్నారు. అయినా బీసీలకు తగిన న్యాయం జరగడం లేదని మండిపడ్డారు.

నలభై రెండు శాతం రిజర్వేషన్ల అంశం ఏమైందని ప్రశ్నించిన ఆయన, ఇప్పుడు బీసీ రాజ్యం దిశగా అడుగులు వేయాల్సిన సమయం వచ్చిందన్నారు. ఏ పార్టీలో ఉన్నా బీసీలంతా ఏకం కావాలని, హక్కుల కోసం సమిష్టిగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని తీన్మార్ మల్లన్న పిలుపునిచ్చారు.

# రంగారెడ్డిని ఎంఐఎంకు ఇచ్చేస్తారా?: ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి

**హైదరాబాద్, జనవరి 18 (తెలంగాణ ముచ్చట్లు):**

రంగారెడ్డి జిల్లాను సగం ఎంఐఎంకు అప్పజెప్పాలనే ప్రయత్నం జరుగుతోందని.. కాంగ్రెస్ ప్రభుత్వంపై చేవెళ్ల బీజేపీ ఎంపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రంగారెడ్డి జిల్లాను ముక్కలు చేసి.. ఆగం చేయకండి. ప్రజాభిప్రాయం లేకుండా మున్సిపల్ విభజన జరుగుతుంది అంటూ వ్యాఖ్యలు చేశారు.



చేవెళ్ల బీజేపీ ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి తాజాగా మీడియాతో మాట్లాడుతూ..'రంగారెడ్డి చుట్టుపక్కల ఉన్న గ్రామాలను చార్మినార్‌లో కలుపుతున్నారు. రంగారెడ్డి జిల్లాను సగం ఎంఐఎంకు అప్పజెప్పుతున్నారా?. పాతబస్తీలో నీళ్ల బిల్లులు, కరెంట్ బిల్లులు కడతారా?. కట్టని వారితో మా జిల్లా ప్రజలను ఎందుకు కలుపుతున్నారు?. మెజారిటీగా హిందూ ప్రజలున్న గ్రామాలను చార్మినార్‌లో కలపడం సరైంది కాదు. పాతబస్తీలో బిల్లుల ఎగవేత వల్ల వాటర్ బోర్డ్, ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్లు నష్టాల పాలవుతున్నాయి.

రంగారెడ్డి జిల్లాల గ్రామాలను చార్మినార్‌లో కలపడం వల్ల, ఆ జిల్లా ప్రజల బ్రతుకులు ఆగం అవుతాయి. మాకు గులాంలు కొట్టడం తెలీదు. గులాంలు కొట్టే బ్రతుకులు మావి కాదు. హైదరాబాద్‌కు ఆర్థిక వనరు రంగారెడ్డి. జిల్లా ఖజానా అంతా నాడు కేసీఆర్ ఫామ్ హౌస్‌కు తరలిపోయింది. నేడు ఎంఐఎం ఇలాకాలోకి పంపేందుకు ప్రయత్నం జరుగుతుంది. పన్నులు కట్టే వారిని, పన్నులు కట్టనివారితో కలపకండి. రంగారెడ్డి జిల్లాపై అనేక అపోహలు ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాను ముక్కలు చేయకండి. ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలి. ప్రజాభిప్రాయం తర్వాత నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం' అంటూ వ్యాఖ్యలు చేశారు.

# చరిత్ర లేని వారు దేశభక్తులా

- ప్రజల కోసం మరో వందేళ్లు పోరాటానికి సిద్ధం
- ట్రంప్ తీరును ఎర్ర జెండా అడ్డుకుంటుంది.
- అమెరికాను ప్రశ్నించే శక్తిని మోడీ కోల్పోయారు
- సిపిఐ శతాబ్ది ఉత్సవ సభలో డి. రాజా

**ఖమ్మం బ్యూరో, జనవరి 18(తెలంగాణ ముచ్చట్లు)**






చరిత్ర లేని వారు దేశభక్తులుగా చెప్పుకునేందుకు తాపత్రయ పడుతున్నారని సిపిఐ జాతీయ కార్యదర్శి డి. రాజా ఆరోపించారు. వందేళ్లుగా ప్రజల పక్షాన పోరాడుతున్నామని భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు అత్యంత కీలక ఘట్టమని ఈ దేశంలో సంపూర్ణ స్వాతంత్ర్యానికి పిలుపునిచ్చిన ఏకైక పార్టీ సిపిఐ మాత్రమేనన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంతాల ముగింపు సభ సందర్భంగా ఖమ్మం ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన పార్టీ కార్యకర్తలతో బహిరంగ సభా స్థలి కిటకిటలాడింది. తెలంగాణ రాష్ట్ర సిపిఐ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజా మాట్లాడుతూ వందేళ్లు త్యాగాలతోనే గడిచిపోయిందని అనేక మంది తమ త్యాగాలతో ఈ నేలను పునీతం చేశారన్నారు. 1925 డిసెంబర్ 26న కాన్పూర్లో సిపిఐ ఆవిర్భావించిందని అంతకు ముందు 1985లో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం జరిగిందన్నారు. ఈ దేశంలో కాంగ్రెస్, కమ్యూనిస్టులకు మాత్రమే ఒక రాజకీయ చరిత్ర ఉందని వందేళ్ల చరిత్ర అని చెప్పుకుంటున్న ఆర్ఎస్ఎస్కు అసలు చరిత్ర లేదన్నారు. దేశ స్వాతంత్ర్యంలోనూ ఆ తర్వాత ఆర్ఎస్ఎస్ పాత్ర ఏమిటని రాజా ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కంటే ముందే సిపిఐ సంపూర్ణ స్వాతంత్ర్యానికి పిలుపునిచ్చిందని ఆయన తెలిపారు. దేశ చరిత్రలో అత్యంత కీలక ఘట్టమని రాజా అభివర్ణించారు. స్వాతంత్ర్య అనంతరం అనేక పరిణామాలలో కమ్యూనిస్టు పార్టీ అత్యంత కీలక భూమిక పోషించిందన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నియంతగా వ్యవహరించాలని ప్రయత్నిస్తున్నాడని మరో హిట్లర్ కావాలనుకుంటున్నాడని ట్రంప్ను ఎర్ర జెండాలు ఎదుర్కొంటాయని రాజా స్పష్టం చేశారు. సామ్రాజ్యవాద ధోరణితో ట్రంప్ వ్యవహరిస్తున్నాడని ఆయన ఆరోపించారు. మెక్సికో, కోలంబియా, క్యూబా వంటి దేశాలకు బెదిరింపులు చేయడం అనుచితమన్నారు. రష్యా, ఉక్రేన్ యుద్ధాన్ని సాకుగా చేసుకుని బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆధిపత్య ధోరణిని ప్రదర్శిస్తున్న ట్రంప్ను ప్రశ్నించే శక్తి భారత ప్రధాని మోడీకి లేదన్నారు. భారత్ రష్యా నుంచి చమురు కొనుగోళ్లు చేస్తుందని దీనిని నిలిపివేయాలంటూ అమెరికా ఒత్తిడి తీసుకు రావడం శోచనీయమన్నారు. పాలస్తీనా అంశాన్ని ప్రస్థావిస్తూ పాలస్తీనా స్వతంత్ర దేశంగా ఉండే హక్కు ఉందన్నారు. ఐక్యరాజ్యసమితి మద్దతు ఉన్న ద్విరాష్ట్ర పరిష్కారానికి సిపిఐ కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. భారతదేశంలో మతోన్మాద శక్తులు విజృంభిస్తున్నాయని సంపద కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతమవుతుందని ఇది దేశ భవిష్యత్తుకు మరింత ప్రమాదకరమన్నారు. ఫాసిస్టు శక్తులను ఎదుర్కొనేందుకు అన్ని లౌకిక శక్తులు ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. బలమైన ఉద్యమ నిర్మాణాల ద్వారా మతోన్మాద శక్తులను అడ్డుకుంటామని రాజా ధీమా వ్యక్తం చేశారు. వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమాన్ని ప్రతిభింభిస్తూ జరిగిన భారీ బహిరంగ సభ నూతన ఉత్తేజాన్ని ఇస్తుందన్నారు. ఈ సభలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వాకాటి శ్రీహరి, సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు అమర్జిత్ కౌర్, గిరిశర్మ, అనిరాజా, ప్రకాష్ బాబు, సందోష్ బాబు, పల్లా వెంకటరెడ్డి, బినయ్ విశ్వం, రామకృష్ణ పాండా, కె. రామకృష్ణ, కుల్దేవ్, జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ కె. నారాయణ, సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తకెళ్లపల్లి శ్రీనివాసరావు, ఈటి నర్సింహ, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, ఎస్కే సాబీర్ పాషా, వనజా, నాగేశ్వరరావు, సత్యనారాయణ, ఎంఎల్సి ఎన్. సత్యం, ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు వందేమాతరం శ్రీనివాస్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు నరేందర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రజబ్ అలీ ఆశయ సాధన కోసం పూర్వవైభవం తీసుకురావాలి

- సిపిఐ నాయకులు మరియు సిపిఐ కార్యకర్తలు కష్టపడాలి
- సిపిఐ పంగిడి మాజీ ఎంపీటీసీ బోడ చిన్న నాయక్
- సిపిఐ పుటాని తండా శాఖ నాయకులు బానోతు నాగేశ్వరరావు

**ఖమ్మం బ్యూరో, జనవరి 18 (తెలంగాణ ముచ్చట్లు)**





భారత కమ్యూనిస్టు పార్టీ భారత గడ్డపై 100 శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఉద్యమాల ఖిల్లా అయిన ఖమ్మంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ విస్తృత ప్రచారం చేశారు. ఖమ్మం ఎస్ ఆర్ బి జి ఎన్ ఆర్ డిగ్రీ కళాశాల మైదానం యందు ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు.

ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ... ఆనాటి కాలంలో పుటాని తండా గ్రామంలో రజబ్ అలీ ఆశయ సాధన కోసం వారి అడుగుజాడలో నడిచి, అమరులైన సిపిఐ నాయకులు భూక్య బిచ్చ నాయక్, బానోత్ బిచ్చ నాయక్, ఆశయాలను గుర్తు చేస్తూ పుటాని తండా ప్రజలు ముందుకు సాగాలన్నారు. పార్టీ నాయకులు పార్టీ సానుభూతి పరులు పుటానితండ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మాజీ ఎంపీటీసీ, గుగులోతు కనకమ్మ, గ్రామ నాయకులు బానోతు కిషన్, గమ్మ, తదితరులు పాల్గొన్నారు.







# కదం తొక్కిన కామ్రేడ్స్

- ఎర్రబారిన ఖమ్మం
- ఎటు చూసినా అరుణ పతాక రెపరెపలే
- నభూతో నా భవిష్యత్తులా జనసేవాదళ్ కవాత్
- ఆకట్టుకున్న కళారూపాలు

**ఖమ్మం బ్యూరో, జనవరి 18 (తెలంగాణ ముచ్చట్లు)**

సీపీఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ సందర్భంగా ఖమ్మంలో కామ్రేడ్స్ కదం తొక్కారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పార్టీ కార్యకర్తలతో ఖమ్మం పుర వీధులు కిటకిటలాడాయి. ప్రతి ఒక్కరూ అరుణ పతాకాన్ని చేతబూని ఎర్రని వస్త్రాలు ధరించి ఖమ్మంకు తరలి రావడంతో ఖమ్మం ఎర్రబారింది. ఉదయం ఎనిమిది గంటల నుంచే సుదూర ప్రాంతాల నుంచి పార్టీ కార్యకర్తలు ఖమ్మం చేరుకున్నారు. నాగపూర్, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాల నుంచి కూడా పార్టీ కార్యకర్తలు సభకు హాజరయ్యారు. ఖమ్మం నగరంలోని ప్రధాన రహదారులన్ని కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తల రాకతో దిగ్బంధించబడ్డాయి. ఎటు చూసినా అరుణ పతాక రెపరెపలే కనిపించాయి. ఖమ్మం నగరంలోకి చేరుకునేందుకు ట్రాఫిక్ జామ్ కావడంతో కిలో మీటర్ల కొద్ది నడిచి కార్యకర్తలు ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల మైదానం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభా స్థలికి చేరుకున్నారు. వందలాది వాహనాల్లో పార్టీ కార్యకర్తలు తరలి రావడంతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం ఏర్పడింది. పెద్ద సంఖ్యలో యువత తరలి రావడం విశేషం. జనసేవాదళ్ కార్యకర్తలే కాకుండా బహిరంగ సభకు వచ్చిన వారిలో యువత ఎక్కువగా ఉన్నారు. క్రమశిక్షణగా మూడు కిలో మీటర్ల మేర నడిచి బహిరంగ సభా స్థలికి చేరుకున్న యువత నాయకుల ఉపన్యాసాలకు, ప్రజానాట్యమండలి పాటలకు అలిసి పోకుండా కేరింతలు కొట్టారు. వందేమాతరం శ్రీనివాస్ అలపించిన ఎర్రజెండా ఎర్రజెండా ఎన్నియాల్లో పాటకు యువత ఊగిపోయింది. పూనకం వచ్చినట్లుగా బహిరంగ సభా స్థలి మొత్తం అరుణ పతాకాలను ఊపుతూ ఒక సరికొత్త వాతావరణాన్ని సృష్టించారు. యువత ఊపు చూసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ఒక్కింత ఆశ్చర్య పోయారు. యువత హాజరైన తీరు చూస్తుంటే వందేళ్లు కాదు మరో వందేళ్లయినా సమ సమాజం కోసం కమ్యూనిస్టు పార్టీ లక్ష్యం కోసం పోరాడతామన్న భావన స్ఫురించింది. వందేళ్ల ఉత్సవాలు చూడాలని వందల కిలో మీటర్ల మేర ప్రయాణించి 70 నుంచి 80ఏళ్లు పైబడిన వృద్ధులు, గతంలో కమ్యూనిస్టు పార్టీలో పనిచేసినా ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల నాయకత్వం సభకు హాజరయ్యారు.

**మూడు ప్రదర్శనలు - వేల మంది జనం :**

బహిరంగ సభ సందర్భంగా ఖమ్మంలో మూడు ప్రదర్శనలు నిర్వహించారు. మొదటి ప్రదర్శన పెవిలియన్ మైదానం నుంచి ప్రారంభమైంది. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన జనసేవాదళ్ కార్యకర్తలు ఖమ్మం పుర వీధుల్లో కదం తొక్కారు. వరుసుకు నలుగురు చొప్పున నిలబడిన ప్రదర్శన రెండు కిలో మీటర్ల మేర ఉండడంతో ప్రదర్శనను పెద్ద సంఖ్యలో నగర పౌరులు తిలకించారు. ముఖ్యంగా యువ మహిళల కవాతు ఆకట్టుకుంది. చిన్నారులు కదం తొక్కుతూ లెఫ్ట్ రైట్ అంటూ నడుస్తూ ఉత్తేజాన్ని ఇచ్చారు. పదేళ్ల లోపు బాలలు సైతం ప్రదర్శనలో పాల్గొని భవిష్యత్తు తరం మాదేనంటూ మరో వందేళ్లయినా కమ్యూనిస్టు పార్టీకి డోకా లేదని తమ కవాతుతో నిరూపించారు. జనసేవాదళ్ కార్యకర్తల కవాతుకు సిపిఐ అగ్ర నేతలు పల్లా వెంకటరెడ్డి, కూనంనేని సాంబశివరావు, గుజ్జుల ఈశ్వరయ్య, చాడ వెంకటరెడ్డి, నెల్లికంటి సత్యం, బాగం హేమంతరావు తదితరులు నేతృత్వం వహించారు. జనసేవాదళ్ కార్యకర్తల తర్వాత సింగరేణి కార్మికులు, యువ మహిళలు, పర్ష పద్మ నేతృత్వంలో నాగళ్లు చేతబూనిన రైతులు కోయ, లంబాడ, జానపద నృత్య కళాకారులు, వందలాది మంది డప్పు కళాకారులు ప్రదర్శనలో పాల్గొన్నారు. బతుకమ్మలతో మహిళలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆ తర్వాత న్యాయవాదులు, వైద్యులు, యువజన, విద్యార్థి సమాఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు. ఇటీవల కాలంలో ఏ రాజకీయ పార్టీ నిర్వహించని రీతిలో ప్రదర్శన సాగింది. ఖమ్మం నయా బజర్ కళాశాల నుండి మరో ప్రదర్శన ప్రారంభమైంది. నయాబజార్ కళాశాల నుండి ప్రారంభమైన ప్రదర్శన మయూరిసెంటర్, జెడ్పి సెంటర్, ఇల్లందు క్రాస్ రోడ్డు మీదుగా సభా స్థలికి చేరుకుంది. ఈ ప్రదర్శనకు రాష్ట్ర సహాయ కార్యదర్శి తకెళ్లపల్లి శ్రీనివాసరావు, బోస్, కె. శంకర్, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తదితరులు నేతృత్వం వహించారు. మూడవ ప్రదర్శన శ్రీశ్రీ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైంది. శ్రీశ్రీ విగ్రహం నుంచి రోటరీ నగర్, మమత రోడ్డు, ఇల్లందు క్రాస్ రోడ్డు మీదుగా సభా స్థలికి చేరుకుంది. జాతీయ సమితి సభ్యులు ఎస్కె సాబీర్పాషా, సిపిఐ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి తదితరులు నేతృత్వం వహించారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

## తేరి వర్సెస్ మంకత్తా.. రీ విడుదల పోరుతో థియేటర్లు దద్దరిల్లనున్నాయా..!



తమిళ సినీ పరిశ్రమలో అగ్ర కథానాయకులైన విజయ్, అజిత్ కుమార్ అభిమానుల మధ్య పోటీ ఎప్పుడూ హాట్ టాపిక్‌గా మారుతుంది. ఇప్పుడు అదే పోటీ మరోసారి రీ విడుదల రూపంలో తెరపైకి వస్తోంది. విజయ్ నటించిన బ్లాక్ బస్టర్ చిత్రం తేరి, అజిత్ కెరీర్‌లో మైలురాయిగా నిలిచిన మంకత్తా ఒకే సమయంలో మళ్లీ థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతుండటంతో అభిమానుల్లో ఉత్కంఠ పెరిగింది.
విజయ్ రాజకీయ రంగ ప్రవేశంతో రూపొందుతున్న జన నాయకన్ చిత్రం సెన్సార్ వివాదాల కారణంగా వాయిదా పడటంతో అభిమానుల ఉత్సాహాన్ని నిలబెట్టేందుకు తేరి చిత్రాన్ని మళ్లీ విడుదల చేయాలని నిర్మాతలు నిర్ణయించారు. అదే సమయంలో అజిత్ అభిమానులను ఉత్సాహపరిచేలా మంకత్తా చిత్రాన్ని కూడా అదే తేదీన విడుదల చేయనున్నట్లు ప్రకటించడంతో రెండు వర్గాల మధ్య పోటీ మరింత ఉధృతమైంది.
తేరి చిత్రంలో విజయ్ పవర్ ఫుల్ పోలీస్ పాత్రలో ఆకట్టుకోగా మంకత్తాలో అజిత్ నెగటివ్ షేడ్ ఉన్న పాత్రతో ప్రేక్షకులను మెప్పించాడు. ఈ రెండు చిత్రాలు గతంలో బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించాయి. ఇప్పుడు రీ విడుదలతో మరోసారి థియేటర్ల వద్ద పాత రోజులను గుర్తు చేసే సంబరాలు కనిపించనున్నాయి. అభిమానులు ఇప్పటికే షోలకు ప్లాన్‌లు సిద్ధం చేసుకుంటూ సోషల్ మాధ్యమాల్లో పోస్టర్లు, నినాదాలతో హంగామా మొదలుపెట్టారు. ఎవరి సినిమా ఎక్కువ వసూళ్లు సాధిస్తుందో అన్న ఉత్కంఠతో తమిళనాడు అంతటా ఆసక్తి నెలకొంది. రీ విడుదల పోరు చివరకు ఎవరి ఆధిపత్యాన్ని చాటుతుందో చూడాలని సినీ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

## సంక్రాంతి బరిలో చిరంజీవి హవా.. ఆరు రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ పూర్తి..!




ఈ సంక్రాంతికి మెగాస్టార్ చిరంజీవి మార్కెట్ స్ట్రెంగ్త్‌పై ఎలాంటి సందేహాలకు తావులేకుండా స్పష్టత వచ్చింది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన మన శంకర వరప్రసాద్ గారు చిత్రం విడుదలైనప్పటి నుంచే బాక్సాఫీస్‌ను షేక్ చేస్తూ దూసుకుపోతోంది. భారీ సినిమాల పోటీ మధ్యలోనూ రోజురోజుకూ వసూళ్లు పెరుగుతుండటం ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. తాజాగా మేకర్స్ ప్రకటించిన అధికారిక అప్‌డేట్ ప్రకారం కేవలం ఆరు రోజుల్లోనే ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా 261 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. పండగ సెలవులను పూర్తిగా వినియోగించుకున్న ఈ చిత్రం మొదటి వారంలోనే అసాధారణ రన్ నమోదు చేసింది. చిరంజీవి స్టామినా ఇంకా తగ్గలేదని మరోసారి రుజువైంది.
ఈ సినిమాకు మరో కీలక మైలురాయి ఏమిటంటే అన్ని ఏరియాల్లో ఆరు రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ పూర్తి కావడం. సాధారణంగా భారీ బడ్జెట్ చిత్రాలు సేఫ్ జోన్‌లోకి రావడానికి పది రోజులు నుంచి రెండు వారాల వరకు సమయం పడుతుంది. కానీ ఈ చిత్రం మాత్రం రికార్డు వేగంతో లాభాల బాట పట్టింది. దీంతో బయ్యర్లకు ముందుగానే పండగ లాభాలు కనిపిస్తున్నాయి. దేశీయ మార్కెట్‌తో పాటు విదేశాల్లోనూ ఈ సినిమాకు గట్టి ఆదరణ లభిస్తోంది. ముఖ్యంగా ఉత్తర అమెరికాలో చిరంజీవి గత రికార్డులను దాటేస్తూ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో ఒకటిగా నిలుస్తోంది. త్వరలో అక్కడ 3 మిలియన్ డాలర్ల మార్క్‌ను అందుకునే అవకాశాలు ఉన్నాయని వాణిజ్య నిపుణులు అంచనా వేస్తున్నారు.
థియేటర్లతో పాటు ఆన్‌లైన్ టికెట్ ప్లాట్‌ఫామ్స్‌లోనూ ఈ సినిమా హవా కొనసాగుతోంది. బుక్‌మైషో వంటి యాప్‌లలో భారీ అడ్వాన్స్ బుకింగ్స్ నమోదవుతుండటంతో పాత రికార్డులు బద్దలవుతున్నాయి. వీకెండ్ ట్రెండ్ చూస్తే వచ్చే రోజుల్లో కూడా వసూళ్లు బలంగా కొనసాగనున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఆరు రోజుల్లోనే 261 కోట్ల మార్క్ దాటడంతో 300 కోట్ల క్లబ్‌లోకి చేరడం పెద్ద విషయం కాదని మేకర్స్ ధీమాగా ఉన్నారు. ఒక ప్రాంతీయ వాణిజ్య చిత్రమే ఈ స్థాయిలో ఆదాయం సాధించడం టాలీవుడ్‌కు అరుదైన ఘనతగా మారింది. మొత్తంగా చూస్తే 2026 ఆరంభంలోనే మెగాస్టార్ చిరంజీవి బాక్సాఫీస్‌కు స్ట్రాంగ్ ఓపెనింగ్ ఇచ్చారని చెప్పవచ్చు.




## అమెరికా మార్కెట్‌లో దక్షిణ కొరియా కార్ల దూకుడు..

ప్రపంచంలోనే అతిపెద్ద ఆటోమొబైల్ మార్కెట్లలో ఒకటైన అమెరికాలో దక్షిణ కొరియా కార్ల తయారీ సంస్థలు సంచలన విజయాన్ని నమోదు చేశాయి. హ్యుందయ్, కియా కంపెనీలు కలిసి ఆల్‌టైమ్ రికార్డు స్థాయి మార్కెట్ వాటాను సాధించి ఆటో రంగాన్ని ఆశ్చర్యపరిచాయి. టారిఫ్‌లు పెరిగినప్పటికీ అన్ని సవాళ్లను ఎదుర్కొంటూ 2025 సంవత్సరంలో ఈ రెండు కంపెనీలు కలిపి 11.3 శాతం మార్కెట్ వాటాను దక్కించుకోవడం విశేషంగా మారింది.
మార్కెట్ పరిశోధనా సంస్థ వెల్లడించిన గణాంకాల ప్రకారం హ్యుందయ్ 9,84,017 వాహనాలను విక్రయించి 6.1 శాతం వాటాను సాధించగా, కియా 8,52,155 యూనిట్లతో 5.2 శాతం వాటాను సొంతం చేసుకుంది. దీంతో అమెరికా మార్కెట్‌లో ప్రముఖ ఆటో కంపెనీల తర్వాత నాలుగో స్థానంలో ఈ గ్రూప్ నిలిచింది. మొత్తం మార్కెట్ వృద్ధి 2.4 శాతం మాత్రమే ఉండగా, హ్యుందయ్, కియా అమ్మకాలు మాత్రం 7.5 శాతం పెరగడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
గత ఏడాది హైబ్రిడ్ వాహనాల అమ్మకాలు ఏకంగా 48.8 శాతం పెరిగి 3,31,023 యూనిట్లకు చేరాయి. జార్జియా రాష్ట్రంలో మూడో తయారీ కేంద్రాన్ని పూర్తి చేయడంతో స్థానిక ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరిగింది. టారిఫ్ భారం వినియోగదారులపై వేయకుండా కంపెనీలు స్వయంగా భరించడం వల్ల ధరలు స్థిరంగా ఉండి కొనుగోళ్లు పెరిగాయి. ఈ వ్యూహం కారణంగా దక్షిణ కొరియా నుంచి అమెరికాకు వాహనాల ఎగుమతులు 4.2 శాతం తగ్గినప్పటికీ, స్థానిక తయారీ ద్వారా అమ్మకాలు మరింత బలపడ్డాయి. మొత్తంగా చూస్తే నాణ్యత, ఆధునిక సాంకేతికత, సరసమైన ధరలతో దక్షిణ కొరియా కార్లు అమెరికా మార్కెట్‌ను దాదాపు కైవసం చేసుకున్నాయన్న మాట వినిపిస్తోంది.

## డీమార్ట్‌లో ఇంత చౌకగా ఎలా..? అసలు రహస్యం ఇదే..!

డీమార్ట్‌లో ఇతర దుకాణాల కంటే ధరలు ఎందుకు తక్కువగా ఉంటాయో చాలామందికి ఆసక్తి ఉంటుంది. దీనికి ప్రధాన కారణం మధ్యవర్తులను పూర్తిగా దూరం పెట్టడమే. సాధారణంగా రిటైల్ దుకాణాలు సరఫరాదారులు, హోల్‌సేలర్లపై ఆధారపడతాయి. కానీ డీమార్ట్ మాత్రం సరుకులను నేరుగా తయారీ సంస్థల నుంచే పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తుంది. దీనివల్ల ఒక్కో వస్తుపై ఖర్చు తగ్గి, ఆ లాభాన్ని వినియోగదారులకు తక్కువ ధరల రూపంలో అందిస్తుంది. అంతేకాదు సరఫరాదారులకు బిల్లులు వెంటనే చెల్లించడం వల్ల అదనపు రాయితీలు కూడా లభిస్తున్నాయి.
మరో ముఖ్యమైన అంశం డీమార్ట్ దుకాణాలు ఎక్కువగా సొంత భవనాల్లోనే ఉండటం. అద్దె భారం తక్కువగా ఉండటంతో నిర్వహణ ఖర్చులు తగ్గుతాయి. అలంకరణలు, ఆర్భాటాలపై ఖర్చు చేయకుండా అవసరమైన వస్తువులకే ప్రాధాన్యం ఇస్తారు. దీంతో నిల్వల నిర్వహణ సులభమవుతుంది, నష్టాలు కూడా తగ్గుతాయి.
డీమార్ట్ వ్యూహం స్పష్టంగా ఒకటే. తక్కువ లాభంతో ఎక్కువ అమ్మకాలు చేయడం. ఒక్కో వస్తుపై లాభం తక్కువైనా పెద్ద సంఖ్యలో అమ్మకాలు జరగడం వల్ల మొత్తం లాభం పెరుగుతుంది. వినియోగదారుల్లో నమ్మకం పెరిగి వారు మళ్లీ మళ్లీ అదే దుకాణానికి రావడం జరుగుతుంది. ఈ విధంగా ఖర్చు నియంత్రణ, నేరుగా కొనుగోలు, తక్కువ లాభ విధానం కలిసి డీమార్ట్‌ను చౌక ధరల దుకాణంగా నిలబెడుతున్నాయి.







## ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మన్ స్కీమ్‌కు గ్రీన్ సిగ్నల్.. వినియోగదారులకు భారీ ఊరట..!

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వినియోగదారుల హితాన్ని దృష్టిలో పెట్టుకొని కొత్త ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మన్ స్కీమ్‌కు ఆమోదం తెలిపింది. ఈ స్కీమ్ అమల్లోకి రాగానే బ్యాంకులు లేదా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థల సేవల్లో లోపాల వల్ల వినియోగదారులకు కలిగే ఆర్థిక నష్టాలకు చెల్లించే గరిష్ఠ పరిహారాన్ని ఇప్పటివరకు ఉన్న 20 లక్షల నుంచి 30 లక్షలకు పెంచనుంది. దీంతో ఖాతాదారులకు మరింత భద్రత, న్యాయం లభించనుంది. కేవలం ఆర్థిక నష్టాలకే కాకుండా వినియోగదారులు ఎదుర్కొనే మానసిక వేదన, అనవసరంగా సమయం వృథా అయిన సందర్భాలకు కూడా ప్రత్యేక పరిహారాన్ని పెంచింది. ఇప్పటివరకు 1 లక్షగా ఉన్న ఈ మొత్తాన్ని ఇకపై 3 లక్షల వరకు అందించవచ్చని స్పష్టం చేసింది. దీని వల్ల సేవలలో నిర్లక్ష్యం జరిగితే బాధితులకు మెరుగైన నష్టపరిహారం దక్కే అవకాశం ఏర్పడింది.
ఈ కొత్త నిబంధనలు జూలై 1 నుంచి అధికారికంగా అమల్లోకి రానున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు అలాగే నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థలపై ఈ నియమాలు వర్తిస్తాయి. వినియోగదారులు తమ సమస్యలను సులభంగా నమోదు చేసుకునేందుకు ఆన్‌లైన్ ఫిర్యాదు వ్యవస్థను కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. బ్యాంకింగ్ సేవల్లో ఎదురయ్యే ఇబ్బందులను ఈ వ్యవస్థ ద్వారా నమోదు చేస్తే అంబుడ్స్‌మన్ ద్వారా త్వరిత పరిష్కారం లభించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దీంతో సాధారణ ఖాతాదారులకు ఇది పెద్ద ఊరటగా మారనుంది.

## కోకాకోలా భారత బాట్లింగ్ యూనిట్ నుంచి భారీ ఐపీఓ.. 9000 కోట్ల లక్ష్యం..!




ప్రపంచంలోనే అతిపెద్ద పానీయాల సంస్థ కోకాకోలా తన భారతీయ బాట్లింగ్ విభాగం హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్‌ను పబ్లిక్ ఇష్యూకు తీసుకురావాలని నిర్ణయించింది. ఈ ఐపీఓ ద్వారా సుమారు 9027 కోట్లను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లిస్టింగ్ పూర్తైతే కంపెనీ విలువ దాదాపు 90000 కోట్లకు చేరుతుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.
ఈ ఐపీఓను 2026 వేసవిలో ప్రారంభించాలనే ప్రణాళిక ఉంది. అయితే వర్షాలు ఎక్కువగా కురిసి పానీయాల డిమాండ్ తగ్గితే దీనిని 2027కు వాయిదా వేసే అవకాశమూ ఉందని సమాచారం. ఈ ప్రక్రియ కోసం ప్రముఖ పెట్టుబడి సంస్థలను నియమించినట్లు తెలుస్తోంది.
హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ భారత్‌లో కోకాకోలా, థమ్స్ అప్, స్ప్రైట్, మాజా, కిన్లీ, దసాని, జార్జియా కాఫీ, ష్వెప్స్ వంటి బ్రాండ్లను తయారు చేసి పంపిణీ చేస్తోంది. దేశంలో పానీయాల మార్కెట్‌లో ఈ సంస్థ కీలక స్థానాన్ని సంపాదించుకుంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 15 తయారీ కేంద్రాలతో కార్యకలాపాలు సాగిస్తోంది. మిగిలిన ప్రాంతాల్లో స్వతంత్ర బాట్లర్ల ద్వారా సరఫరా జరుగుతోంది. గత ఏడాది కోకాకోలా తన గ్లోబల్ వ్యూహంలో భాగంగా ఈ సంస్థలోని 40 శాతం వాటాను జుబిలెంట్ గ్రూప్‌కు 12500 కోట్లకు విక్రయించింది. బాట్లింగ్ కార్యకలాపాల నుంచి క్రమంగా దూరమై బ్రాండ్ అభివృద్ధి, నూతన ఆవిష్కరణలు, డిజిటల్ విస్తరణపై దృష్టి పెట్టాలన్నదే కంపెనీ లక్ష్యంగా తెలుస్తోంది. ఈ ఐపీఓ కూడా అదే వ్యూహంలో భాగమని విశ్లేషకులు చెబుతున్నారు. ఆర్థిక సంవత్సరం 25లో సంస్థ ఆదాయం 12751 కోట్లుగా నమోదైంది. ప్లాంట్లను ఇతర బాట్లర్లకు అప్పగించడం, అలాగే అన్‌సీజనల్ వర్షాల కారణంగా అమ్మకాలు తగ్గడం ఇందుకు కారణమని సంస్థ వర్గాలు వెల్లడించాయి. అయినప్పటికీ భారత మార్కెట్‌పై కోకాకోలా విశ్వాసం కొనసాగుతుండటంతో ఈ భారీ ఐపీఓకు రంగం సిద్ధమైంది. ఈ లిస్టింగ్ విజయవంతమైతే భారత పానీయాల రంగంలో మరో కీలక మైలురాయిగా నిలవనుందని అంచనా వేస్తున్నారు.

## పెరిగిన బజాజ్ పల్సర్ ధరలు



బజాజ్ ఆటో.. ఎంపిక చేసిన పల్సర్ మోడళ్ల ధరలను రూ.461 నుంచి రూ.1,460 వరకు పెంచింది. పెరిగిన ధరల కారణంగా.. చాలా బైకుల రేట్లు మారిపోయాయి. ఎంట్రీ లెవల్ పల్సర్ 125 సిరీస్‌లో, నియాన్ సింగిల్ సీట్ వేరియంట్ ధర ఇప్పుడు రూ.79,048 నుంచి రూ.79,939కి పెరిగింది. కార్బన్ ఫైబర్ సింగిల్ సీట్ ధర రూ.85,633 నుంచి రూ.86,411కి పెరిగింది, కార్బన్ ఫైబర్ స్ప్లిట్ సీట్ ధర రూ.87,527 నుంచి రూ.88,547కి పెరిగింది.
పల్సర్ N125 బైక్ ధరల్లో ఎలాంటి మార్పు లేదు. అయితే NS125 బేస్ వేరియంట్ ధర రూ. 91,182 నుంచి రూ. 92,642కు చేరింది. LED BT రూ. 93,792 నుంచి రూ. 94,253లకు, LED BT ABS రూ. 98,400 నుంచి రూ. 98,955లకు చేరింది. పల్సర్ 150 సింగిల్‌డిస్క్ & ట్విన్‌డిస్క్ వేరియంట్ల ధరలు వరుసగా రూ.1,11,669 & రూ.1,15,481 వద్ద (వీటి ధరల్లో ఎటువంటి మార్పు లేదు) అలాగే ఉన్నాయి. పల్సర్ NS160, NS200, RS200 ధరలు రూ.702 చొప్పున పెరిగి, ఇప్పుడు రూ.1,20,873, రూ.1,32,726 & రూ.1,71,873 వద్ద ఉన్నాయి. డిసెంబర్ 2025లో 2026 అప్‌డేట్ తర్వాత పల్సర్ 220F రూ.1,28,490 నుంచి రూ.1,29,186లకు చేరింది. 250cc విభాగంలో, పల్సర్ N250 ధర రూ.1,34,166 కాగా, టాప్‌ఎండ్ పల్సర్ NS400Z ధర రూ.1,93,830 వద్ద ఉంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in